

పెద్దకథ :

# అడవికాచిన వెన్నెల

## శ్రీ 'బుచ్చిబాబు'

మొదటినుంచీ అడవిలో సంచారం, జంతువుల్ని వేటాడ్డం అంటే ఎంతో సరదా నాకు. ఎఱగా చెట్టుకి మేకని కట్టేసి, చెట్టుమీద తెల్లవార్లూ కాచివుండడం, వొక ముసిలి పులి రావడం, దాన్ని తుపాకితో కాల్చడం, అది గాయపడి కుంటుకుంటూ పోవడం - మామయ్య చెప్పిన యీ అనుభవం నేనెప్పుడూ మరిచిపోను. కొద్దో గొప్పో, నాగరకజీవనానికి అలవాటుపడ్డ అందరికీ, యీ అడివి జీవితంపై, మోజుంటుందనుకుంటాను. ప్రాచీనత్వం, అనాదివాసుల బ్రదుకుపోకడలు, అడవిజాతులకుండే వేటతృష్ణ - యివన్నీ మనందరిలోనూ జీర్ణించివుంటాయి కాబోలు; యీ ప్రాచీనత్వాన్ని ప్రకటించే అవకాశం వొస్తే వొదులుకోము; ఆటలపై మోజు దీనికి తార్కాణం; కుస్తీ, 'బాక్సింగ్' చూడ్డం సరదాలనుంచి, యుద్ధంలో పాల్గొనడంవరకూ, రకరకాల అనుభవాల్ని సృష్టించుగుంటాం. పట్నాలలో టార్జాన్‌చిత్రాలకి వొచ్చినంత డబ్బు, మరే చిత్రానికీ రాదు.

నా స్నేహితుడు చంద్రారెడ్డికి అటవి శాఖలో పని; మరికొందరు ఆఫీసర్లూ తనూ కలసి, వొక పెద్ద అడవికి నాలుగైదు మైళ్ళ దూరంలో కాంప్ చేస్తున్నారుట; వీలైతే—వేసంగి శెలవలుగా—తనతో వో వారంరోజులు గడపడానికి రమ్మని వ్రాశాడు. పరిసరాలనీ, వాళ్ళ జీవితాన్నీ, విపులంగా వర్ణించాడు; వొచ్చేటప్పుడు పెద్దసైజు టార్చ్‌లైటూ, కాలక్షేపానికి వో అరడజను పుస్తకాలూ తీసుకు రమ్మంటూ: "నీకు పెళ్లీ పెడాకులూ లేదు. మా అల్లుణ్ణి పులి పొట్టనెట్టుగుందని వాపోయ్యే అత్తగారు లేదు. ఈ చుట్టుప్రక్కల, పులులు, చిరతపుల్లు, వున్నా, అవి బ్రహ్మచారుల జోలికి పోవుగనక నువ్వు నిర్భయంగా రావొచ్చు—మళ్లా క్షేమంగా యింటికి పంపించే పూచీనాది." అని వుత్తరం ముగించాడు రెడ్డి.

రెండుమూడు డిటెక్టివ్ నవల్సు,—ఆ రోజుల్లో అవంటే నాకు పిచ్చి—ఆఫ్రికా, అడవుల్లో యాత్రికుల అనుభవాల గ్రంథాలు, రెండు పొడుగాటి టార్చ్‌లైట్సు తీసుకుని ఫలానా రైల్లో వొస్తున్నానని రెడ్డికి వుత్తరం వ్రాసి ప్రయాణంకట్టాను. రాత్రంతా రైల్లో పెద్దపుల్లుల్ని గురించిన కథలు చదివి, మధ్యలో ఏ పులేనా కంపార్ట్‌మెంట్‌లోకి దూకుతుందేమోనని చూశాకానీ అల్లాగేం జరగలేదు.

ఆవూరి ప్లాట్‌ఫారమ్‌మీద రైలు నిలిచేటప్పుడకి తెల్లారింది. నాకు వూరు కనబళ్ళేదు—అన్నీ కొండలు, చెట్లు—మనుషుల అలజడి తక్కువ. చంద్రారెడ్డి వున్న చోటనే బండి నిలిచింది. సామాన్లు బైటకి తీసి బంట్రోతు నెత్తిన పెట్టాడు. ప్లాట్‌ఫారమ్ మీదికి దిగి అటూ యిటూ పరీక్షగా చూశాను. నేను తప్ప అక్కడ యింకెవ్వరూ దిగినట్లులేదు—ఐదారుగురు మట్టుకు, ఏవో బస్తాలతో రైల్లో ఎక్కారు. ఇంజన్ వైపునుంచి, మాకేసి, వొకాయనా, వొకావిడా రైలుపెట్లని పరకాయిస్తూ నడిచి రావడం చూశాను. ఆయన ఎత్తుగా, లావుగా వున్నాడు; కాకీట్రౌజర్, డబుల్‌బ్రెస్ట్ కోటు, కండ్లజోడు, చేతులో హంటర్ వున్నాయి; మగ్యపాపిడితీసి, పక్కలకి అణిచి దువ్వేసిన పొట్టిక్రాప్, సన్నటి మీసం, వొత్తుగా కనుబొమ్మలు, ఆకృతి కొంచం భీకరంగా కనబడ్డా దగ్గర్నుంచి చూస్తే మొహం లేతగా కనబడింది; వయస్సు పాతిక, ముప్ఫైలోపుగానే వుండాలనిపించింది. ఆవిడ మరీ లేతగా కనిపించింది; యిరవైలోపు—సన్నంమీద పొడుగ్గా కనిపించినా, అంత పెద్ద పొడుగూ కాదు. చాలా పల్చని మొహం,—సూర్యుడి కిరణాల్లో, కరుగుతున్న బంగారంలాగ, మెత్తగా మెరిసిపోయ్యే శరీరఛాయ—జీలుగు బెండుతో నిలబెట్టిన ఓడకొయ్యనకు

వెండితెర తెరచాప ఎత్తిన దృశ్యం స్ఫురిస్తుంది. తెల్లచుక్కల, ఆకుపచ్చ సిల్కు మఫ్లర్ తలకి చుట్టింది. అందులోంచి సన్నటి వొంకులజుట్టు పుట్టలోపలికి కదులుతున్న పాముతోకలా, నుదుటిమీద జారుతోంది.

కొంతదూరం మాకేసి నడిచి, మళ్లా యిద్దరూ వెనక్కి తిరిగి ఇంజన్ వేపు నడుస్తున్నారు. చివరదాకా నడిచి, వెంటనే వెనక్కి తిరిగి మాకేసి నడిచివొస్తున్నారు. దగ్గరకొస్తుంటే తెల్లటి సిల్కుచీరపై, పసుపుపచ్చ పూలడిజైను, చోకలెట్ కలర్ బోర్డరు, పఫ్రటిజాకెట్టు, స్ఫుటంగా కనిపించాయి. ఎన్నటి నాజూకైన ముక్కు, పైకగుపించే సల్లరంధ్రాలు, చెవలకి ఆకుపచ్చ గుండ్రటి రాయి—ఆమెలో ఆకర్షణ ఎందులో వుందా అని ఆలోచిస్తుంటే: "ఆవిణ్ణి తరవాత చూద్దువుగాని సావకాశంగా, ముందు బైటకెడదాం, నడు." అంటూ చంద్రారెడ్డి, నా బుజాన్ని నెట్టాడు. నే వులిక్కిపడ్డాను; గేటుకేసి నడుస్తున్నాం.

"ఆయనెవరు రెడ్డీ?" అని అడిగాను.

అతను సమాధానం చెప్పేలోపలే వారిద్దరూ వొచ్చేసి మా ముందు నిలబడ్డారు. రెడ్డి, నన్ను ఆయనతో పరిచయం చేశాడు.

"మా ఫారెస్టాఫీసర్, ప్రేమానంద్." ఆయన తల పంకించాడు.

"నా స్నేహితుడు,—పట్నంనుంచి వొచ్చాడు—"అన్నాడు రెడ్డి.

నేను నమస్కారం పెట్టాను.

"మా తోడల్లుడి అన్నగారు బెంగుళూర్ నుంచి యీ బండిలో వస్తానన్నాడు. ఏదీ, రాలేదే." అన్నాడు ప్రేమానంద్, రైలు వంక కోపంగా చూస్తూ.

"బెంగుళూర్ కేసి సైక్లోనట—అంచేత రాలేదేమో." అన్నాడు రెడ్డి.

"అవును. మరిచాను. నిన్ననే మనం ఆవిషయం మాట్లాడుకున్నాం కూడాను. సరే, యిహ నెందుకూ—వెడదామా." అని ప్రేమానందం నాకేసి తిరిగి: "మళ్లా కలుసుకుందాం బంగ్లాలో—యింకా వుంటారుగా." అన్నాడు.

"ఏదో రెండుమూడు రోజులుంటాను." అన్నాను.

"ఈలోగా ఏ పులీ తినకుండా వుంటే వారం వుంటాడు. అవునా?" అని చంద్రారెడ్డి, నవ్వాడు. కాని ప్రేమానంద్ మొహంలో నవ్వు లేదు. భీకరంగానో, దిగులుగానో వున్నట్లుంది అతని మొహం. పెద్ద ఆఫీసర్ కనపర్చవల్సిన అమానుషత్వపు ధోరణి కాబోలు ననుకున్నాను. ఆయన వెళ్లబోతూ, వొక్కక్షణం నిలిచిపోయి:—

"మరిచాను. మై వైఫ్." అని, ఆమెని పరిచయం చేశాడు. ఆవిడ, చుట్టూ కప్పుకున్న చీరకొంగులోంచి చేతులు బైటకి తీసి నమస్కారంలాంటిది చేసి, అగమ్యగోచరంగా నవ్వింది. స్త్రీకి నమస్కారం పెట్టడం నా కలవాటు లేదు. నేనూ అల్లాంటిదే చేసి, ఆవిడ కళ్ళల్లోకి చూశాను. నా కప్పుడర్థమైంది. ఆమె ఆకర్షణ కళ్ళల్లోది. మహారణ్యంమధ్యలో కదలికలేని లోతుకొలను లాంటి నేత్రాలవి; ఆ చూపు వెనక, అఘాతాల ప్రతిబింబాలు మెదుల్తున్న అలజడి, వెనకచూపుల్లోని తీక్ష్ణమైన చాంచల్యం, అన్నింటినీ తాళంతో బిగించిపారేసినట్లు, నిశ్చింతగా బిగించుకున్న సన్నటి పెదవులు, చీకటి నిండు చంద్రుణ్ణి బంధించినట్లు వన్నెలని కప్పుకుని ప్రాణాలని రక్షించుకుంటున్న కారడవి—యివన్నీ కలిసి, ఆ ఆకర్షణని వ్యక్తపరుస్తాయేమో నాకు తెలీదు.

వారిద్దరూ గేట్‌లోంచి వెళ్లిపోయ్యారు. ఫర్లాంగవతల నిలిచివున్న కార్లో ఎక్కారు. కారు కదిలి, జువ్వలాగ బైలు దాటి కొండల వెనక అంతర్ధానమైంది.

మాకోసం, టాపులేని పెట్టెబండి సిద్ధంగా వుంది. ముడి విప్పితే జారిన సిల్కు తెరలా, సూర్యుడికాంతిలో మంచు, కొండలమీద నుంచి జారుతోంది. పచ్చరబ్బర్‌లా రోడ్డు మెలికెలు తిరిగింది. చంద్రారెడ్డి ఫ్లాస్కు తీసి మూతలో టీ పోసి తాగడాని కిచ్చాడు. బండి కదిలింది. వాళ్ల కాంప్‌దగ్గరకి షుమారు మూడుమైళ్లదూరం వుందిట. గుట్టలు, బైలు, కొండలు దాటి, కాంప్‌సమీపంలోకొచ్చాం.

"అదిగో అదే మా ఆఫీసర్‌గారి బంగాళా" అని చూపించాడు రెడ్డి. రోడ్డు కుడివైపున దూరంగా చెట్లమధ్య బంగాళా కనిపించింది. దానిముందు, రెండుమూడు పాకలున్నాయి; వెనక ఎత్తుకొండ కింద, చెరువులాంటిదుంది.

"ఆవిడొక్కత్తే ఎల్లా వుండగల్గుతోంది?" అని అడిగాను. చంద్రారెడ్డి కొంటెగా నవ్వాడు. రెడ్డి చిన్నప్పుడు క్లాసులో తెలివైనవాడుగా పేరుపడలేదు; కాని చమత్కారంగా, హాస్యంగా మాట్లాడేవాడు. అటవీశాఖలో ఐదేళ్లుగా పనిచేస్తున్నా, సంస్కృతి అంతగా దెబ్బతినలేదు.

"వొక్కత్తే వుండే ఖర్మమేం—మొగుడున్నాడుగా!" అన్నాడు. "మీ ఆఫీసర్లందరూ, భార్యలతో కాపరం వుంటున్నారా యీ కాంపులో?"

"లేదు, లేదు—మేం అందరం వొంటిగానే వుంటున్నాం. ఆయనొక్కడే, భార్యని తీసుకొచ్చింది. కొత్తపెళ్లాం. మరిచాను, ఆవిడపేరు నిర్మల. ఆ గుడిసెల్లో బంట్రోతులిద్దరుంటున్నారు వాళ్ల ఆడాళ్లు ఆవిడకి సాయంగా వుంటున్నారు"

వాళ్లంతా కాంప్ ఎందుకు చేశారో చెప్పడం మొదలెట్టాడు రెడ్డి. కొంత సర్వే పనుందిట; కొంతభాగం అడివి ధ్వంసంచేసి, వొక అటవీపరిశోధనాలయం నిర్మించాలిట; అన్నింటికంటె ముఖ్యం, ఆ అడవిలో రెండుమూడు నెలలుగా, నరమాంసాని కలవాటైన ముసిలిపులి తిరుగుతూ నష్టం కలగచేస్తోందిట; దూడల్ని, మేకల్ని, కాకుండా, యిద్దరు కట్టెలుకొట్టేవాళ్లని కూడా పొట్టనెట్టుకుందిట. దాన్ని వేటాడి పట్టుకోడం కూడా, వాళ్ల పన్లలో వొకటిట. ఆ పులికి "రాయలకేసరి" అని నామకరణం చేశారుట —రాయలసీమలో వుంటోంది గనక.


"ప్రేమానందం యిదివరలో ఎన్ని పులుల్ని వేటాడాడు?" అని అడిగాను.

"ఆయన్నిగురించి నన్నేమీ అడక్కు; నాకేమీ తెలీదు. ఆయన యీ డిపార్టుమెంట్‌లో చేరి వో సంవత్సరమైంది; పైగా యీ డివిజన్‌కి బదిలీ అయి, నెలకూడా కాలేదు. ఈ కాంప్‌లో నాలుగురోజుల్నించే, మా పరిచయం. చాలా మితభాషి; చనవు కనబర్చడు. తగినట్లుగానే మేం అందరం ముభావంగానే వుంటున్నాం" అన్నాడు.

బండి కాంప్‌దగ్గర నిలిచింది—అంతా, చదునుగా కనబడే పచ్చగడ్డిబైలు; మధ్య నాలుగైదు పెద్ద చెట్లున్నాయి; వాటి మధ్యలో అక్కడక్కడ, టెంట్లు వేశారు. గడ్డితో వో పాక వేశారు. అది ఆఫీసుట. చెట్ల కింద, చల్లటి విశాలమైన నీడలు—అక్కడ రెండు కాంప్ టేబిల్సు, కుర్చీలు వేశారు. అరబైటే, వొంటలు, భోజనాలూ.

"ఇవి తప్ప, యింకేవీ యిళ్లు లేవా?"

"లేకేం. మనం బంగాళా చూశామే—దానవతలగా, ఫర్లాంగుదూరంలో వో చిన్ని కాలనీ వుంది,—వో అరడజను కొంప లుంటాయి. వర్క్‌మెన్, మేస్త్రీ, కంట్రాక్టర్



—వొకరిద్దరు ఆఫీసర్లూ వాళ్ళంతా అక్కడుంటారు. మేం నలుగురం మాత్రం, సరదాపడి, టెంట్లు వేసుకున్నాం. ఇదుగో, రాఘవులు—నిద్రాదేవి కీ పూట విడాకులిచ్చి వొస్తున్నాడు—" అంటూ, రెడ్డి, రాఘవుల్ని పరిచయంచేశాడు.

"గరనా—టీ తగలెట్టరా." అని కేకేశాడు. గురవడు, వొక ట్రేలో, గోధుమ రొట్టెల దొంతర తెచ్చి బల్లమీద పెట్టాడు. అవి తిని, మళ్లా కొంచం టీ తాగి, స్నానాలకి బైలుదేరాం. పందగజాలమారంలో, చిన్ని కొలనుంది—లోతు లేదు—అడుగున ఎఱ్ఱగా కంకరసొంపు కనబడుతుంది—నీళ్లు తేటగా మధురంగా వున్నాయి. మేం వెళ్లేటప్పటికి, అందులో యిద్దరు వ్యక్తులు స్నానాలు చేస్తున్నారు. వాళ్లనికూడా రెడ్డిపరిచయంచేశాడు. ఒకతను శ్రీహరి,—మారెడ్డి సహాధ్యాయుడు; రెండోఅతను, మధుసూధనం,—రెడ్డికంటె కొంచం తక్కువ గ్రేడు వుద్యోగి—డిపార్ట్‌మెంట్‌లో ప్రవేశించి, ఏడెనిమిది నెలలైంది. — యిక్కడికి కొత్తగా బదిలీ అయి, రెండు వారాలైందిట. మధుసూధనం, నాజూకుగాను, తెలివిగాను కనిపించాడు. సన్నటి, పల్చటి కోలమొహం, మెత్తటి నుదురు, విశాలంగా, చక్రాలలా కనబడే అందమైన కళ్లు—వీటికి యవ్వనం కొత్త వెలుగు నిచ్చింది. అతను అందమైనవాడని, పురుషులుకూడా అనుకోవల్సిందే; కాని వొకటిరెండు లోపాలున్నట్లు నాకు తోచింది; పళ్లు వొకటో, రెండో—కొద్దిగా వంకర. మొహం మృదువుగా, కోమలంగా వున్నా, పెదవులు సుంద్రంగా బలంగా వుంటాయి—నవ్వినప్పుడు, మొహం వింతగా ముడతలుపడి,—యవ్వనం సిగ్గుతో వొణుకుతున్నట్లు—బుగ్గమీది నొక్కులో దాక్కున్నట్లుగా వుంటుంది ఆ నవ్వు. నడుం సన్నంవమూలాన చాతీ వెడల్పుగా కనబడుతుంది—ఛాతీ వెంట్రుకలులేకండా, నున్నగా వుంది.

శ్రీహరి మోటుగా కనిపించినా, వయస్సు పాతికలోపేఅనుకున్నాను. మోటుతనానికి కొంత కారణం, నెత్తిమీద వెంట్రుకలు పల్చబడటమే; వెడల్పుముక్కు, చిన్ని కళ్లు, కోసేసినట్లు కనబడే నుదురు—యివన్నీ పెద్దవాడిగా కనబడేటట్లు చేస్తాయి.

"ఇక్కడ నీళ్లు చూశారా ఎంత నిర్మలంగా వున్నాయో." అన్నాడు శ్రీహరి.

"నిర్మలన్నపదం రోజు కొకసారేనా వాడకుండా వుండలేడండి మావాడు." అన్నాడు మధుసూధనం శ్రీహరిని వుద్దేశించి.

"పెండ్లికావల్సినవాడవు—మేం కాపరాలు చేస్తున్నాం—వేళాకోళం భరించి వూరుకోకూడదు?" అన్నాడు శ్రీహరి. వాళ్ల స్నానాలు ముగిసినై; బట్టలువేసుకుని కాంప్‌లోకి పొయ్యారు. వాళ్లు వెళ్లిం తర్వాత చంద్రారెడ్డి నాతో. చెప్పాడు; కుర్రాడు. పచ్చపచ్చగా వున్నాడనీ, బ్రహ్మచారి కావడంవల్లనూ, అందరూ మధు

సూదనాన్ని వేళాకోళం చేస్తుంటారుట.

"ప్రేమానందాన్ని గురించి ఏవేవో వింతగా చెబుతుంటారు, వ్రాసి పోక." అన్నాడు. చంద్రారెడ్డి.

కింద వుద్యోగులందరూ కలిసి, పైవుద్యోగినిగురించి కాస్తంత నిరసనగా మాట్లాడడం సహజంగానే వుంది. అతనిలో లోపాలన్నీ తవ్వితీస్తారు; లేకపోతే సృష్టిస్తారు; శీలంలోనూ, నైతికప్రవర్తనలోనూ లోటు కనబడకపోతే, అతని తెలివితేటలకి విలువ కడతారు; అందులోనూ ఏమీ దొరక్కపోతే, అతని భార్యనిగురించేనా గుసగుసలకి అవకాశంవుంటే కథా వస్తువుని అల్లుకుని తృప్తిపడతారు కాబోలు—అనిపించింది నాకు.

"అతనిలో ఏమిటి విశేషం?" అని అడిగాను.

"నే నేమీ నమ్మననుకో — వాళ్లనడం, అతను నపుంసకుడని."

"అల్లా అనుకోడానికి ఆధారం?"

"నా కేమీ కనబడలేదు. నాలుగైదేళ్లుగా కాపురంచేస్తున్నా సంతానం లేదుట."

నాకు నవ్వొచ్చింది. సంతాననిరోధక సాధనాలు యత్నిస్తున్నారనుకోకూడదు? రెడ్డికి నా వాదము అంత రుచించలేదు.

"ఎందుకు చెయ్యాలి? వాళ్లు పిల్లల్ని పోషించలేని బీదస్థితిలో లేరు. పైగా వొకరిద్దరు సంతానం కలిగింతర్వాత, అరికట్టడం జరుగుతుందేమో." అన్నాడు.

"నిర్మలఅందం చెడకుండా వుంచాలని సంకల్పించారేమో." అన్నాను.

ఈసారి రెడ్డి నవ్వాడు.

"నువ్వంతా ఊహాప్రపంచలో విహరిస్తుంటావు; భావకవిత్వం యింకా రాస్తున్నావా?" మా స్నానాలూ ముగిసినై, కాంప్‌దగ్గరకి చేరుకున్నాం." తొమ్మిదైంది. చెట్లకింద చల్లటి నీడలమధ్య సూర్యరశ్మి తివాచీలో అల్లికగా వెలిగిస్తోంది. చల్లదనానికి స్పృహతప్పినట్లు, చెట్లమీదనుంచి ఆకులు కిందికి రాలిపోతున్నాయి. సర్వీచెట్లు దూరంగా రోదిస్తున్నాయి.

"ప్రేమానందాన్నిగురించి మీ అనుమానాలు యీ పూట చర్చించండి, మావాడు విని తీర్పుచేస్తాడు—మానసికశాస్త్రం అంటే చెవికోసుకుంటాడు, మా వాడు." అంటూ రెడ్డి నన్ను మళ్లా వాళ్లకి పరిచయం చేశాడు. రాఘవులు ప్రారంభించాడు.

"ఆయనలో ఏదో తిరకాసు లేకపోతే, ఆవిడ ఆపని ఎందుకు చేస్తుందోయి?"

"ఏపని?" అని అడిగాను ఆతృతతో.

"ఆత్మహత్య తలపెట్టింది. పట్టపగలు; మధ్యాహ్నం మాడింటికి,—మాట్లాడవేం శ్రీహరీ—నువ్వు వాళ్ల చుట్టానివేగా." అన్నాడు రాఘవులు. శ్రీహరి, ప్రేమానందానికి చాలా దూరపు చుట్టంట, అంచేతే కాబోలు, ప్రేమానందాన్ని గురించి మాట్లాడంలో అంత వుత్సాహం కనబర్చడంలేదు. "నేను చెబుతాను పట్టు అంటూ రాఘవులు, నిర్మలజీవితంలో వొక ఘట్టం చిత్రించాడు.

నిర్మలతండ్రి స్థితిపరుడు, ఎస్టేట్లలో తాశీల్దారుగా చాలా డబ్బు పలుకుబడి సంపాదించాడు; ప్రభుత్వవుద్యోగులలో పెద్దవాళ్ళందరితో పరిచయం వుంది. తల్చుకుంటే ఏపనైనా, ఎంతటి పనైనా చేయించుకుగాగల్డు; నిర్మలకి అక్కయ్యా, చెల్లెలూ వున్నారు; అప్పగారు మనోరమని—భాగ్యవంతుల కుటుంబంలో యిచ్చి పెండ్లి చేశాడు; భర్తకి బోలెడు వ్యవసాయం కాకుండా, వ్యాపారంకూడా వుంది. వ్యాపారం అతనన్నగారు చూస్తూ, బెంగుళూరులో వుంటాడు. అతన్ని రిసీవ్ చేసుకునేందుకే వుదయం ప్రేమానందం స్టేషన్ కెళ్ళాడు.

నిర్మలఅత్తవారు అంత స్థితిపరులు కాకపోయినా, కుర్రాడి తెలివి, చదువూ చూసి, వివాహం చేశాడు. పెండ్లినాటికి నిర్మలకి పదిహేడేండ్లుంటాయి; స్కూల్ ఫైనల్ కాన్వెంట్‌లో చదివింది. పెండ్లి కాగానే అత్తవారింటి కొచ్చింది. ప్రేమానందం చదువు ముగిసింది కాని వుద్యోగం లేదు; మామగారి ప్రోద్బలంమీద, ఐదారు నెలలు అటవీశాఖలో తర్ఫీదుపొందాడు: ట్రైనింగ్ ముగిసిన నాలుగునెల్లలో మామగారి ధర్మమా అంటూ, యిప్పుడు చేస్తున్న పెద్ద వుద్యోగంలో మొదట్లోనే ప్రవేశించాడు.

భర్త ట్రైనింగ్ కెళ్ళిన ఐదారునెలలూ, నిర్మల అత్తవారింట్లోనే వుంది; విచిత్రమైన వ్యాధికి గురైంది. భోజనం చెయ్యదు. అందరూ బలవంతం చెయ్యగా ఏదేనా అంటే, డోక్కొంటుంది; మనిషి క్షీణించిపోతోంది; డాక్టర్లు పరీక్ష చేశారు; వాళ్ళకేమీ లోటు కనబళ్లేదు; మందు లిప్పించారు; ఏమీ ఉపయోగించలేదు. భోజనం మట్టుకు లేదు. కాసిని పాలో, ఓవల్టీనో, ఎప్పుడేనా బ్రెడ్, బిస్కట్స్ మాత్రం తీసుకుంటుంది. అసలు ఆకలే లేదంటుంది. అత్తగారు భూతవైద్యం చేయించింది; లాభం లేకపోయింది; హిస్టీరియా అన్నారు, గాలన్నారు; ఎవరో మందెట్టారన్నారు. తండ్రి, కూతుర్ని తనతో తీసుకెళ్లాడు.

ప్రేమానందం, భార్యని చూడ్డంకోసం అత్తవారింటి కెళ్ళాడు. కార్యం చేస్తే వ్యాధి కుదురుతుందన్నారు; తాశీల్దారు వీల్లేదన్నాడు; "కార్యం చెయ్యడం ఏమిటీ—ఎప్పుడో అయింది" అన్నారుట. భర్త వారంరోజు లుండి వెళ్లిపొయ్యాడు. ఆనాడు ఆదివారం. తాశీల్దారు కాంప్ కెళ్ళాడు; తల్లి పడుకుంది; చెల్లెలు హాల్లో వుయ్యాల వూగుతూ రేడియో వింటూ కూర్చుంది. మనోరమబావగారు మట్టుకు ముందుగదిలో పేపర్ చదువుకుంటున్నాడు టప్పీమని పెద్ద చప్పుడైంది. పక్కింటి కృష్ణయ్యగారు—ఆయనికి టెలిగ్రాఫ్ ఆఫీసులో పని—లేచాడు. నిర్మల నూతులో పడిందని కేక లేశాడు. నలుగురూ పోగయ్యారు; నిచ్చెనలు దింపి, ఆమెని పైకి లేవదీశారు. అదీ ఆమె ఆత్మహత్యకి చేసిన మొదటి యత్నం. కారణం ఏమీ లేదు. తల్లి తండ్రి, ఎందుకో చెప్పమని రహస్యంగా ఎంతో బ్రతిమలాడారు. నిర్మల సమాధానం చెప్పదు. 'ఊరికినే' అందిట.

ఆ సాయంత్రం యీ వార్త తెలీగానే శ్రీహరి చూడ్డానికి వెళ్లాడు—అప్పుడు శ్రీహరి ఆ వూళ్లో చదువుకుంటున్నాడు. చీకటిపడింతర్వాత మధుసూధనంకూడా చూడ్డాని కెళ్లాడు—అప్పుడతను, ఆవూరు, స్నేహితుడి పెండ్లి కొచ్చాడుట.

ఈ కథ వింటే ఆశ్చర్యంకలిగింది. అకారణంగా, వృత్తిపుణ్యానికి, ఎవరైనా ఆత్మహత్య తలపెడతారంటే నేను నమ్మలేకుండా వున్నాను. అట్లాగన్నాను.

"మతిభ్రమ కాకూడదా?" అన్నాడు రాఘవులు.

"మతిభ్రమ కావొచ్చు— దానికేనా ఏదో కారణం వుండాలి. నిర్మలకి వివాహం యిష్టమేనా?" అని అడిగాను.

"నిర్మలపెండ్లి నే చూశాను. అయిష్టత వున్నట్లు ఎవ్వరూ అనుకోలేదు. మహావైభవంగా జరిగింది పెండ్లి. నిర్మల సంతోషంగా,

సరదాగా వుందనే మేం అనుకున్నాం. ఏం మధూ, నువ్వూ చూశావుగా?" అన్నాడు శ్రీహరి.

"ఏమోస్సీ—సీటుమీద కూర్చున్న వ్యక్తులు దిగులుగా వున్నారా, హుషారుగా వున్నారా కనుక్కుందామన్నంత పరీక్షగా చూళ్లేదు. నా కళ్లకది అన్ని పెళ్లిళ్ల మాదిరిగానే వుంది. పైగా పెండ్లినాటి సాయంత్రమే నే వెళ్లి పొయ్యాను. తరవాత రెండుమూడు రోజులు దాకా అక్కడే నువ్వున్నావుగా—నీకే బాగా తెలియాలి." అన్నాడు మధు.

"అవును. ఉన్నాను. ఎక్కడా, పేచీలు, మాటపట్టింపులూ వొచ్చినట్లు లేదు. ఆరువేలు కట్నం చదివించారు; అమ్మాయికి నాలు గైదువేల ఖరీదైన వెండిబహుమతు లొచ్చాయి...ఊరేగింపునాడు, ముత్యాల ఓడ కట్టించారు—ఆ దీపాల్లో నిర్మల, బంగారు జరీ చీర, ఎఱ్ఱరంగుని..." శ్రీహరి వర్ణన పూర్తి కాకుండానే మా చెంద్రా రెడ్డి, అడ్డుకున్నాడు. "బాబూ, యీ వర్ణన మాకక్కర్లేదు—వో ఇరవై పెళ్లు విన్నాం. అసలు విషయానికి రండి" అన్నాడు

నేను వూరేగింపునాటి నిర్మలను వూహించుకుంటూ మౌనంలో పడ్డాను. నా కొకటి రెండు అనుమానాలు కలిగాయి.

"ఆ ఆదివారంనాడు, తాశీల్దారుగారింట్లో ఎవరెవరున్నదీ, వుదయంనుంచి, నూతులో పడేవరకూ, ఏమేమి జరిగిందీ, విపులంగా ఎవరేనా చెప్పగల్రా?" అని అడిగేశాను, ఏ వొక్కర్నీ వుద్దేశించకుండా.

శ్రీహరి సమాధానం చెప్పాడు. "నేనంతా ఆ పూటే ఆరాతీశాను. నిర్మల వుదయం లేచింది. తల్లితో కలిసి కాఫీలు అవీ యిచ్చింది. బావగారు అన్నగారు—ఆయనపేరు కుటుంబరావు—కాఫీ తాగి వూళ్లో కెళ్లాడు. నిర్మల కాస్సేపు రేడియో పెట్టుకుందట. తర్వాత స్నానం చేసి వంటింట్లో పనిచేసింది. మధ్యాహ్నం భోజనానైంతర్వాత వో గంట నిద్రపోయింది. లేచేప్పటికి రెండైంది. అప్పుడు నే వెళ్లాను—ఏమో తోచక కాసేపు రేడియో విందామని—"

"కాయ్యకోయ్—కాసేపు నిర్మలని చూద్దామని వెళ్ళావ్!" అన్నాడు రాఘవులు.

శ్రీహరికి కోపం వొచ్చింది. కాని తిగమింగుకున్నాడు—మొహం వుద్రేకంతో వుడికింది.

"తప్పా? అదీ వో వుద్దేశమే. నా కేమీ దురుద్దేశం లేదు. పైగా ఆమె భర్తతో కాపరం చేస్తోంది."

"దురుద్దేశం వుందని మేం అనలేదు. నీ కెందుకంత భయం...?" అన్నాడు రాఘవులు.

"అసలు విషయం చెబుదురూ—మధ్యలో యివన్నీ ఎందుకు..." అని మా రెడ్డి సణిగాడు.

మళ్ళా శ్రీహరి ప్రారంభించాడు.

"కాసేపు నిర్మల నాతో మాట్లాడింది. చెల్లెలు తనూ కాఫీలకోసం వంటింట్లో కెళ్ళారు. కాసేపు ముందుగదిలో పేపర్ చూసి, కాఫీ తాగి, నేను వెళ్లిపొయ్యాను. ముందుగదిలో కుటుంబం నిద్రపోతున్నాడు. నిర్మల అతన్ని లేపి కాఫీ యిచ్చింది. నేను రోడ్డుమీద ఫర్లాంగుదాకా వెళ్లి పోయి వెనక్కి తిరిగాను. కుటుంబం గబగబ నడిచి రావడం చూశాను. అంతే, నాకింకేమీ తెలీయదు—ఆరింటికి, నిర్మలని నూతులోంచి తీశారన్న వార్త మధుసూదనం చెప్పాడు" మధుసూదనం తన విషయం మొదలెట్టాడు.

"నేనా వుదయం తొమ్మిదింటికి వాళ్లింటి కెళ్ళాను. బి. ఎ. పూర్తిచేసి వుద్యోగం లేని రోజు లవి. తాశీల్దారుగారు, మా నాన్నగారు స్నేహితులట—దూరపు చుట్టరికం వున్నా, కలిసిమెలిసి వుండటం పడలేదు—అబ్బాయిని నాదగ్గరకు పంపు, ఎందులో నేనా వుద్యోగం చూస్తానని, తాశీల్దారు మానాన్నకి వ్రాశారు. ఆవిషయమై, తాశీల్దారుగార్ని చూద్దామని కెళ్ళాను. ఆయన ఆరోజున లేడు. కాంప్ కెళ్ళాడుట. ఆసంగతి నిర్మలచెల్లెలు చెప్పింది. వెళ్లిపోబోతుంటే, నిర్మ లప్పుడే వొచ్చింది. స్నానం చేసి, భోజనానికి వుండమంది. తాశీల్దారుగారొచ్చింతర్వాత వస్తానని వొచ్చేశాను. నే నక్కడ మొత్తం నలభై నిమిషాలు గడిపుంటాను. ఐదుగంటలకి కాఫీహోటల్లో నిర్మలఆత్మహత్యవిషయం ఎవరో అనుకుంటుంటే విని, చూద్దామని కెళ్లాను. దోవలో శ్రీహరితో చెప్పాను. అప్పటికి జనం చుట్టూ మూగేశారు. నేను నిర్మలని చూళ్లేదు. ఎవ్వరితో మాట్లాడలేదు."

నిర్మలచేసిన ఆత్మహత్యవిషయం ఆలోచించినకొద్దీ చిత్రంగా కనబడుతోంది. కారణం ఏదో వుండాలి. అది తెల్సుకోవాలన్న నిశ్చయం నాలో అప్పటికి బలపడింది.

"మరొక్క ప్రశ్న. ఆరోజున పోస్టుజవానొచ్చి, వుత్తరా లేవన్నా యిచ్చాడా?"

శ్రీహరి జవా బిచ్చాడు.

"వెధవమందమరుపు నేనూ—! అవును. నే వున్నప్పుడే, పోస్టుబంట్రోతొచ్చాడు. నిర్మలచెల్లెలు వెళ్లి తీసుకుంది. రెండుకార్డులు వొక కవరు కాబోలు. నిర్మల చెల్లెలిదగ్గర్నించి, వాటిని తీసుకొని, గదిలో కెళ్లింది. అవునవును ఐతే మీ అనుమానం ఏమిటి?"

కాసేపు నిదానించి, నాకు తోచింది చెప్పాను.

"నా అనుమానం ఏమిటంటే, ఆవొచ్చిన కవరు భర్తదగ్గరంచి. అందులో నిర్మలకి కష్టం తోచించే సంగతులు వుండివుంటాయి. ఆ వుత్తరం వొచ్చిన గంటలోనే ఆత్మహత్య చేసుకుంది."

మా రెడ్డి యిల్లాగన్నాడు.

"ఆత్మహత్య, పట్టపగలు, బహిరంగంగా తలపెట్టడం చూస్తే తనకి నిజంగా చావాలన్న సంకల్పం లేదనిపిస్తోంది. రెండో యత్నంకూడా పగటివేళే చేసింది. ఆకర్షణ, జాలి పొందుదామని తప్ప, నిజంగా చనిపోవాలని వుద్దేశం వుంటే, విఫలమయ్యే యత్నాలెందుకు చేస్తుంది?" రెడ్డి అన్న మాటలు ఆలోచించతగ్గవే. ఈ మాటలతో నన్ను రెండుప్రశ్నలు ఎదుర్కొన్నాయి. మొదటిది: ఆత్మహత్య ఎందుకు తలపెట్టింది? రెండోది: నిజంగా మరణించాలన్న యత్నమేనా?

కథ పూర్తిగా విన్నతర్వాత ఆలోచించడం మంచిదనుకుని— ఆ రెండో యత్నం వివరాలు చెప్పమన్నాను. రాఘవులు అమిత వుత్సాహంతో చెప్పబోతుండగానే, ప్రేమానందం, బంట్రోతు కాగితాలుకట్టలు, రావడం చూసి విరమించాడు. వాళ్లు ఆఫీసు పని చూసుకోవా లన్నారు. రెండుగంటల సేపుట. ఈలోగా అల్లా షికారుగా తిరిగి రమ్మని, రెడ్డి నాకో తుపాకీ, టెలెస్కోపు యిచ్చి సాగనంపాడు.

నేను, నాలుగైదు ఫర్లాంగులు నడిచి, అక్కడ వో చిన్న కొండ కనబడితే, దాని పైకి యెక్కి వెళ్లాను. టెలెస్కోపులోంచి, చుట్టుపక్కల పరకాయించి చూశాను. దూరంగా మా వాళ్ళ టెంట్లో, చెట్లు కనబడ్డాయి. కొండకి వుత్తరంగా చెట్లు—, దాని వెనుక అడివి కాబోలు—

దక్షిణంగా పాతిక గుడిసెలు, వాటి వెనక చెరువు కనిపించాయి. చెరువుకి అవతల గట్టున, ప్రేమానందం బంగ్లా—దాని ముందుగా వొంకర్లుతిరిగి కొంతదూరం వెళ్లాక చిక్కపడ్డ జుట్టులో పాపిటలాగ మాయమైన ఎఱ్ఱరోడ్డు—అన్నీ అగుపడుతున్నాయి. ప్రేమానందం బంగ్లాముందు పెద్ద పెద్ద చెట్లు నాలుగైదున్నాయి. వాట్లల్లో వొకదానికి వుయ్యాల వ్రేళ్లాడుంది. ఆ వుయ్యాలపై నిర్మల కూర్చుంది. ఎవరో ముసిల్ది వుయ్యాల వూపుతోంది.

నిర్మలనుగురించి అక్కడ జనం వింతగా చెప్పుకుంటున్నారంటే ఆశ్చర్యమేముంది! అక్కడందరూ మొగాళ్లు,— పైగా బ్రహ్మచారులుగా వుంటున్నారు. నిర్మల ఎంతో అందమైంది. శరీరం పల్చగా, నీరసంగా కనబడ్డా, అందులో యవ్వనం ఆపాదించిన వికాసం, బలంకూడా వున్నాయి. బలుపుతో స్ఫుటంగా కనబడనివి రొమ్ములొక్కటే. మొహంలో—ముఖ్యంగా కళ్లల్లో—అలుముకున్న విషాదచ్ఛాయలు యవ్వనాన్ని కొంతవరకూ కప్పిపుచ్చాయనక తప్పదు. సంధ్యకోసం వేచివున్న శరీరఛాయ నిర్మలది. వెన్నెలని కామించి అలిసిపోయిన వెర్రి తృష్ణ; అడివంతా అల్లుకుపోయిన జీవజ్వాల; ఆమె కనువిప్పితే జ్వాల నిల్చిపోతుంది; వెన్నెల నక్షత్రాలని ప్రదర్శించి బురఖా వేసుగుంటుంది. నిర్మల వొంటిద్దై, ఆకలిదప్పులు తీరక అల్లాడిపోయి, వెన్నెల వెలుగు, అడివిబలం తనే శరీరంలో సృష్టించి, పొంగించి, ఎదుర్కునే శక్తి సృష్టించలేక, తనే హతమౌతుంది. అడివికాచిన వెన్నెల. వెన్నెలనే కాల్చిన అడివిమంట నిర్మల.

నా మనస్సు ఎల్లాగో ఐపోయింది. తన సౌందర్యం ధ్వంసం చేసి, హరింపచేసేవారు లేక తను ఆత్మహత్య తలపెట్టిందా అనిపించింది. సౌందర్యం తన మెరిసిపొయ్యే నేత్రాలని వుంచుకోలేదా? ఇవన్నీ భ్రాంతులని తెలుస్తోంది. మానవుడి ప్రవర్తనకి మల్లేనే, మానవుడి వూహకూడా చిత్రమైంది. వూహలే యధార్థాలైతే, మానవుడి హృదయం, ఆశ్చర్యంతో పగుల్తుంది. సౌందర్యం నిర్మలలో యధార్థమైంది. తన శరీరం పగలగొట్టుకుంటోంది—ఆమెశరీరమే హృదయం గనక.

ఈ భావాలతో నాకళ్లు చెమ్మగిల్లినై. అది ఏడ్పురాని బాధ; కన్నీరు లేని కారుణ్యం; సజీవమైన జాలి. ఇది మావాళ్లతో చెబితే నవ్వుతారు. నన్ను పిచ్చివాడికింద కడతారు; నామీద గురి తప్పుతుంది; నన్ను గౌరవించరు; హేళన చేస్తారు. ఒక విషయం తేలిపోయింది. నిర్మలెప్పుడూ మరణించదని. ఆమె వొక్క సంవత్సరమో, నెలో, వారమో, గంటో, క్షణమో, ప్రజ్వరిల్లి జీవించడానికి సంకల్పించింది. ఒక్కసారి ఆ వేదనలో, సర్వశక్తులు ధారపోసి, ఆనందంలో హతమౌతుంది నిర్మల జీవించడం అంటే మరణించడం. ఆత్మహత్యయత్నాలు అల్లా జీవించడానికి ఆమె చేసే యత్నాల చిహ్నాలు.

కొండదిగి కాంప్‌వేపు నడవడం సాగించాం. ప్రేమానందం, బంగ్లాకు వెడుతున్నారు. మావాళ్లు అలిసిపోయి, రెండోసారి స్నానాలకి సంసిద్ధులౌతున్నారు. అందరం చెరువుకెళ్లి స్నానాలు చేశాం. చెట్లనీడలమధ్య నీళ్లు చల్లగా వున్నాయి. శరీరాల్ని కడిగి పవిత్రంచేసే, నిర్మలజలం. మళ్లా నిర్మల!

భోజనాలదగ్గరే, నిర్మల చేసిన రెండో యత్నంగురించి రాఘవులు ప్రారంభించాడు. కాని నాకు తప్ప, యితరులెవ్వరికీ వినేటందుకు వోపిక లేదు. కాసేపు పడుకుని లేద్దామన్నారు. సరేనన్నాను. టెంట్‌లో హోల్డాల్ విప్పుకుని పరున్నాను.

నేను లేచేటప్పటికి నాలుగైంది. అప్పటికప్పుడే మామిత్రులందరూ ఆఫీసుపనిలో పడ్డారు. ఆ చెట్లకిందే ఆఫీసు. కాగితాల కట్టలు, ఫైల్సు, ట్రేలు, డవాలిబంట్రోతులు అటూ యిటూ తిరగడం - నాకు నవ్వొచ్చింది. ఆ వుద్యోగిబృందాన్ని చూస్తూ కూర్చున్నాను. ఇంతలో పెట్టిబండి రావడం, టపాల్ అందుకోడం - వారి జీవితంలో అదొక చరిత్రాత్మకఘట్టం. వార్తాపత్రికలు, మాగజేన్సు వొచ్చాయి. నాముందు వో పత్రిక పడేశారు. గురవడు బ్రెడ్, స్లైసెస్‌కింద తరిగిపెడుతుంటే, నేను వొక్కొక్కటే టీలో ముంచుకుని తింటూ చదువుకుంటున్నాను. గంట జరిగింది, ప్రేమానందంతోబాటు మిగతవారందరూ లేచారు.

"ఏమండీ, మీ కిక్కడెట్లా వుంది?" అని అడిగాడు ప్రేమానందం.

"చాలా బాగుందండీ— అప్పుడప్పుడు నాగరికతలోంచి యిట్లా పారిపోకపోతే, జీవితంపై విరక్తి పుడుతుంది." అన్నాను.

"మీ విషయంలో అంతే అనుకోండి. మేం మట్టుకు, అప్పుడప్పుడు, యీ అడివిలోంచి నాగరికతలోకి పారిపోతూండాలి." అని నవ్వాడు. మిగత వుద్యోగులందరూ అతని 'జోక్'కి నవ్వడం సాగించారు.

"పులివేటకోసం యిక్కడ మీరందరూ మకాం చేశారుటగా. మీ రిదివరలో, పులుల్ని వేటాడారా?" అని అడిగాను.

"నేను నీలగిరి ప్రాంతంలో కొత్తగా పనిలో ప్రవేశించిన రోజుల్లో వేటకి వెళ్లానుగాని, పులిని ఎదుర్కోడం జరగలేదు" ఆయన యింకా చెప్పబోతుంటే మధ్యలో రాఘవులు అందుకున్నాడు.

"అవును, మధుసూదనంకూడా అప్పుడు అక్కడ వారివద్దే పనిచేస్తూ ట్రైనింగ్ అయ్యాడు. మధుసూదనం పులిని పొదల్లో నిద్రపోతుంటే చూశాట్ట. నిద్రపోతున్న పులిని చంపటం భావ్యంకాదని, వొచ్చేశాడు. అవునా మధూ?"

"అయితే మధుసూదనం అసాధ్యుడన్నమాటే" అన్నాను. మధుసూదనం అవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు మౌనంలో పడ్డాడు.

అప్పుడు అతన్ని వుద్దేశించి శ్రీహరి యిల్లా అన్నాడు.

"మధుకేం—మధు ఎంతకైనా తెగించగల్డు. పెళ్లాం పెడాకులు లేదుగనక."

అందరూ నవ్వారు. మధుసూదనంపై ఛలోక్తులు ప్రయోగించి వినోదించడం, వారందరికీ పరిపాటైపోయింది.

"అదేవన్నముక్క, పెండ్లిండ్లు జరిగినమేం అందరం సాహసులం కామంటావా? సంసారంఅంటే పులినోట్లో తల దూర్చడం కాదూ?" అన్నాడు మా రెడ్డి.

అందరూ బిగ్గరగా నవ్వారు. ప్రేమానందం నవ్వడానికి యత్నంమాత్రం చేసి విఫలుడయ్యాడని నా అనుమానం.

"చీకటి పడకముందే, మా యిల్లు చూద్దురుగాని రండి." అని ప్రేమానందం నన్ను ఆహ్వానించాడు.

నేనంగీకరించాను. రెడ్డి, నేను, ఆయన, వారి బంగళాకేసి నడవడం సాగించాం. మిగతావాళ్లు వెనక దిగడ్డారు.

"మధుసూదనం పులిని చూసినట్లు నాతో చెప్పలేదు. చిత్రం. ఇప్పుడు మీరందరూ వింటుంటే వినడమే" అన్నాడు ప్రేమానందం.

(46 వ-పేజీ చూడుడు)

# అడవికాచిన వెన్నెల

(14 వ-పేజీ తరువాయి)

"దెబ్బతో చెదిరిపోయి, మరిచిపోయుంటాడు. పైగా, తరువాత కొద్దిరోజుల్లోనే, ఆతనికి బదిలీ అయిందిగా" అన్నాడు రెడ్డి.

"అవునవును"

"అవుతే, మీతో నన్నుకూడా వేటకి తీసికెళ్లాలి, నేను రెండు రోజుల్లో వెళ్లిపోతున్నాను" అన్నాను.

"మీ కిక్కడ కాలక్షేపం అవుతుంది. ఏదో యీ చుట్టుపక్కల వో ముసలి పులి వుండి, చాలా నష్టం కలిగిస్తోందంటారు యిక్కడి వాళ్లు. వాళ్ల మాటలు పూర్తిగా విశ్వసించలేం. కొస్తుంటే గంపంత చేస్తారు. ఇదిగో తోకంటే, అదుగో పులంటారు. తీరా వెళ్లిచూస్తే, ఏమీ వుండదు. నే నింతవరకూ, ఏడుమైళ్లదాకా అడవిలో పర్యటనం చేశాను. రెండు గేదల కళేబరాలు చూశానుగాని, పులి నాకంట బడ్లేదు. పైగా యిక్కడ మేం యీ పులికోసం కాంప్ చెయ్యలేదు. ఈ అడవి వుంది చూశారూ, యిందులో సగంభాగం, సంస్థానానికి చెందింది. దాని నిర్వహణ మన ఇండియా ప్రభుత్వంయాజమాన్యంలోకి తీసుకురావడానికి, కావల్సిన యేర్పాట్లు అంచనా వెయ్యమని మమ్మల్ని యిక్కడికి పంపించారు."

ఇంతలో బంగళాదగ్గరకి చేరుకున్నాం. రెండు కాంప్‌కుర్చీలు బైటపడేశాడు. బంట్రోతు, టీ తెచ్చాడు. ప్రేమానందం, నీలగిరి అడవిఅధికారుల తెలివితక్కువతనం గురించీ, ప్రస్తుతం అతను తలపెట్టిన కార్యకలాపం గురించీ, లెక్చ రిచ్చాడు. సూర్యుడు దూరంగా చెట్లగ్రామనుల్లో మరుగుపడ్డాడు. పక్షులు భీకరంగా రోదిస్తూ చెలరేగాయి. మేం లేచి, సెలవు తీసుకున్నాం.

"మీరు వెళ్లేలోగా వేట ఏర్పాటు చేస్తాను. రెండుమూడు రోజులు వోపిక పట్టండి" అన్నాడు ప్రేమానందం.

నేను, రెడ్డి, వెనక్కి తిరిగాం. దూరంగా, నాలుగైదు మేకలు రావడం చూశాం. వాటి వెనక యిద్దరుస్త్రీలు-పనివాళ్ల తాలూకు కాబోలు-నడుస్తున్నారు. వారి వెనక నిర్మలుంది—సూర్యుడు మరచిపోయి, దిగవిడిచిన, కిరణంలా, సంధ్యలో శరీరం ఎఱ్ఱబడి, ఆ ఎఱ్ఱదనం, చీరని ఆక్రమించినట్టుగా వుంది. మాకు నలభై గజాల దూరంలో కొచ్చింది. ఎంత పీలగా, బలహీనంగా వుంది! చీర మడతలకి లొంగిపోయిన పల్చటి రొమ్ములు! కాని, అది సమయంకోసం వేచివున్న సింహపు నడుంలో యిమిడిన శక్తిలాంటి సన్నదనం! మాకు దూరమైపోయింది. రెడ్డి నన్ను వెనక్కి తిరిగి చూడనివ్వలేదు. మరుక్షణంలో మా ఎదురుగా మధుసూదనం శ్రీహరి మరిద్దరు బంట్రోతులు వొస్తున్నారు.

"ఇళ్లకి పోతున్నాం. మళ్లా వుదయం కల్సుకుందాం." అన్నాడు శ్రీహరి.

"ఈపూట మా టెంట్స్‌లో పడుకుందాం రాకూడదూ? నా స్నేహితుడుకూడా వున్నాడు. పైగా యింటిదగ్గర ఎవ్వరూ లేరుగా! అన్నాడు మా రెడ్డి.

"నాకు తలనొప్పిగా వుంది. జ్వరం వొస్తుంది, నిద్రపోకుంటే." అన్నాడు శ్రీహరి.

"భోజనం చేసి నే వొచ్చివుంటాలెండి" అన్నాడు మధుసూదనం. మేం కాంప్‌దగ్గరికి చేరుకున్నాం.

భోజనా లయ్యాయి. గురవడు పెద్ద కట్టెలు పేర్చి మంటచేశాడు. చెట్లమధ్య అందంగా వెన్నెలనీడలు పడుతున్నాయి. అక్కడ వెన్నెల మరింత నిండుగా స్వచ్ఛంగా వున్నట్లనిపించింది. అందులో నిశ్చలత్వం వుంది. ఫ్యాక్టరీపొగలు, సిగరెట్టుపొగలు, మేఘాలు, దుమ్ము, ప్రేమతో అలసిన నిట్టూర్పులు—వీటివల్ల భంగంకాని ప్రశాంతత. ఆకుల రెపరెప నిలిచిపోయినప్పుడు, వెన్నెల ధ్వనిస్తే వింటున్నట్లుగా వుంటుంది. సర్వీచెట్ల సంగీతం జోలపాటలా అడివిని నిద్రపుచ్చుతోంది. ఎక్కడో ఏదో కీటకం రోదనతో పారా వేస్తూంది. ఏదో దూరంగా మృగాల అయోమయపు అరుపులు—అడివి జీవితంలో ఐక్యమయ్యాయి మా ప్రాణాలు.

అరగంటలో మధుసూదనం శ్రీహరి కూడావో బంట్రోతు పెట్రోమాక్స్‌లైటుతో చక్కావచ్చారు—మహాజ్వాలలో అగ్గిపుల్ల పడేస్తే వెలిగినట్లుగా వెన్నెట్లో పెట్రోమాక్స్‌లైటొకటి!

శ్రీహరి వొంట్లో అస్వస్థత కాస్త సర్దుకుందన్నాడు. అందరం పక్కలు పరుచుకున్నాం.

"ఈమధ్య వో చిత్రం జరిగిందండోయ్!" అని మొదలెట్టాడు రాఘవులు.

చెప్పమన్నాను.

"వో వారంక్రితం ప్రేమానందానికి వో ఆకాశరామన్న వుత్తరం వొచ్చింది—పోస్టులో."

"నీ కెట్లా తెలుసు?" అన్నాడు రెడ్డి.

"నేను వా రింటివైపు వెడుతుంటే చెత్తకాగితాలకట్ట చెట్లవెనక పడివుంది. నేను ఏమీ తోచక కెలికాను. అందులో మూడు కాగితపు ముక్కలు నన్నాకర్షించినై. వాటిని సరిచేసి చదివాను. అందులో ఏముందో ఎరుగుదురా? 'నిర్మల ఆత్మహత్య ఎందుకుచేసుకుంటుందో కనుక్కున్నావా?' అని.

ఆ వుత్తరాన్ని విమర్శించి, తర్కించడం ప్రారంభించారు. మారెడ్డి అన్నాడు:—

"నువ్వే వ్రాశివుంటావు. కొంటెపనలు నీ కలవాటేగా!"

"భ భ—భలేవాడివే. మరెవరేనా అయితే అట్లాంటివి చేద్దును. తెల్లారి లేస్తే, మన కాయనతో పని. ఆయనదగ్గర చేస్తానా, తప్పుకాదు?" అన్నాడు రాఘవులు.

"ఆ పని నిర్మలని ఎరుగున్నవాళ్లెవరో చేసివుంటారు." అన్నాడు రెడ్డి.

"ఇక్కడున్నవాళ్లల్లో, ఎరుగున్నవాళ్లు శ్రీహరి, మధుసూదనం." అన్నాడు రాఘవులు.

"అస్తమానం, నన్ను యీ ప్రశంసలోకి దించకండి. నాకు కోపం వొస్తుంది." అని మధు విసుక్కున్నాడు.

"నిర్మల రెండోమారు తలపెట్టిన ఆత్మహత్యయత్నంగురించి వినాలనంది, మీ కేమన్నా అభ్యంతరం లేకపోతే." అన్నాను నేను.

"విసుక్కున్నందుకు క్షమించండి—నా కేమీ అభ్యంతరం లేదు." అన్నాడు మధు.

"అభ్యంతరపెట్టినా, నేను విరమించే బాపతు కాదు. నేను చెబుతా వినండి." అంటూ రాఘవులు పెట్రోమాక్స్‌దీపం ఆర్పేసి, గాథ చెప్పడం సాగించాడు.

గనోక్యూర్
అన్ని సెగలకు గంటలలో గుణము
రాజమండ్రి

"రెండోయత్నం, తరవాత ఏడాదికి జరిగింది. ఈసారి అత్తవారింట్లో, భర్త మరో వూళ్లో వుద్యోగంలో కెళ్ళాడు. మామగారు ఆఫీసు కెళ్లాడు. అత్తగారు వంటింటిగుమ్మంలో చాపేసుకుని పడుకుంది. ముందుగదిలో బావగారు నిద్రపోతున్నాడు. మరిది—పదహారేళ్లుంటాయి—అవీ యివీ సవరిస్తూ యింట్లో తిరుగుతున్నాడు. తోటికోడలు పిల్ల నిద్రపోతోంటే, యిగలు ముసరకుండా విసురుతూ పక్కగదిలో కూర్చుంది. మధ్యాహ్నం, మూడు కావొస్తోంది. దొడ్లో పెద్ద చప్పుడయింది. పక్కింటి రమణయ్యగారు, విన్నాడు. దొడ్లోకి పరిగెత్తి, పిట్టగోడమీదనుంచి చూశాడు. 'ఏమర్రోయ్, ఎవరో నూతులో పడ్డారు' అని చక్రికేకేశి, కర్రలు, నిచ్చెన, తాడు, తెచ్చాడు. ఇంట్లో అందరూ లేచారు. వీధిలోంచి గుఱ్ఱపుబండివాడొకడొచ్చి, నూతులోకి దిగి నిర్మలని పైకి చేరేశాడు. నీళ్లు తాగేసింది; చైతన్యం లేదు. డాక్టర్ని పిలిపించారు—శుశ్రూష చేశారు. వోగంటకి తేరుకుంది. తాశీల్దార్ గారికి టెలిగ్రాం యిచ్చారు. బైటకి పొక్కకుండా, గప్ చిప్ చేసేశారు. అది కథ."

ఇంచుమించు, యీ యత్నం కూడా, మొదటి యత్నంలాగే వుంది. హంతకుడు, దురంతం తలపెడితే, వొకసారి అలవాటు పడ్డ ఫక్కీనే, పదేపదే అవలంబిస్తాడని, డిటెక్టివ్‌నవల్స్ చదివితే తెలుస్తుంది. ఇంకా చిత్రం ఏమిటంటే, గంటకూడా, అదే. ఆరోజు ఏమేమి జరిగింది, ఎవరెవరొచ్చిందీ, వివరాలు కావాలన్నాను.

శ్రీహరి చెప్పాడు, సమాధానం.

"నేనప్పుడు ఆ వూళ్లోనే వున్నాను. కోర్టులో సాక్ష్యాని కొచ్చాను. నిర్మలఅత్తవారింటికి పదకొండుగంటల కెళ్లాను. ఆమె బావగారితో కాసేపు కబుర్లు చెప్పాను. భోజనాలు చేశాం. జట్కా తెప్పించి, నేనూ, మరిదీ వూళ్లోకి వెళ్లాం. మరిది స్కూలువద్ద దిగిపొయ్యాడు. అప్పటికి పన్నెండున్నరైంది. కోర్టుపని చూసుకుని, సాయంత్రం ఐదున్నరకి స్టేషన్‌లో చేరుకున్నాను. ప్లాట్‌ఫారమ్‌మీద మధు కనిపించాడు—అప్పుడు అతనికి ఆ వూళ్లోనే వుద్యోగం - రోడ్ల యిలాకాలో—బుక్ స్టాల్ చూడ్డాని కొచ్చాడుట. రేం యుద్దరం వుండగా, మరిదితో చదువుకునే కుర్రాడొకడొచ్చి, మాకీవార్త చెప్పాడు. నేను రైల్లో వెళ్లిపొయ్యాను. మధు వెళ్లి చూశాడనుకుంటా."

"లేదు, లేదు.—నీతో చెప్పలేదనుకో—నేనూ నీతోబాటే, ఆ రైల్లోనే ప్రయాణం చేశాను. మా పినతల్లి కూతురుకి ఏదో సంబంధం వొచ్చింది, రావల్సిందని మా నాన్న వైరిస్తే వెళ్లాను" అన్నాడు మధుసూదనం.

"మీరు వుద్యోగం అక్కడెంతకాలం చేశారు ?" అనడిగాను.

"అబ్బే, చిన్న వుద్యోగం, తాశీల్దార్ గారి ప్రోద్బలంమీద అంగీకరించి, నాలుగు నెల్లు చేశాను. తరవాత, అడివిశాఖలో యీ వుద్యోగాని కొచ్చేశాను."

"ఆ నాలుగు నెలల్లో మీకు ప్రేమానందంతో పరిచయం వుందా?" అనడిగాను.

"నాకంత పరిచయం లేదు. అతను మితభాషి. ఒకటి రెండుసార్లు, అతను సెలవుమీదొచ్చినప్పుడు, క్లబ్బులోనూ, సినిమాల్లోనూ చూశాను."

"సినిమాకి భార్యాసమేతుడై, వొచ్చేవాడా ?"

"నేను చూడగా ఎప్పుడూ లేదు. పైగా నేనక్కడున్న నాలుగు నెలల్లో, రెండునెల్లు అతను అత్తవారింట్లోనే వుండేవాడు కాబోలు. రెండుమూడుసార్లు వాళ్లింటికి వెళ్లినప్పుడు, నిర్మలని కాని, ప్రేమానందాన్ని కాని ఎప్పుడూ చూళ్లేదు."

"పాపం" అన్నాడు రాఘవులు.

"ఆ జోక్ నేను రెలిష్ చెయ్యను రాఘవులు." అని మధుసూదనం కోపం సూచించాడు.

"మరవుతే, నువ్వు వాళ్లింటికి వెళ్లే అవసరం ఏమొచ్చిందోయ్!" అన్నాడు ధీమాగా రాఘవులు.

"నేను నీకు సమాధానం యివ్వక్కర్లేదు. వీరడుగుతున్నారు గనక చెబుతున్నాను. నేను ప్రేమానందంతో మాట్లాడదామనే వెళ్లేవాణ్ణి. అతనొచ్చినప్పుడు కబురుచెయ్యమని, నిర్మలమరిదిని అడిగాను. అతనితో సంప్రదించి అడివిశాఖలో ట్రైనింగ్ పొందితే, వుద్యోగం దొరుకుతుందని తాశీల్దార్ వ్రాశాడు. ఆవిషయం ముచ్చటించడంకోసం వెళ్లేవాణ్ణి."

"మొత్తం ఎన్నిసార్లు వెళ్లుంటావు ?" అన్నాడు రెడ్డి.

"నేనా ?—నేను అగడజనుసార్లైనా వెళ్లుంటాను" అన్నాడు శ్రీహరి, తనని వుద్దేశించి యీ ప్రశ్న అడిగారనుకుని.

"నిన్నెవ్వరూ అడగలేదు." అన్నాడు రాఘవులు.

"అడక్కపోయినా చెబితే ప్రమాదం లేదు. సందేహం తీరిపోతుంది. నేను నిజం చెప్పేస్తున్నా. ఏదో సాకు వున్నా నేను నిర్మలని చూడాలన్న వుద్దేశంతో వెళ్లేవాణ్ణని వొప్పుకోవాలి." అన్నాడు శ్రీహరి. దీనితో అందరూ మౌనంలో పడ్డారు కాసేపు.

నేనే మొదట మాట్లాడాను.

"మీరు నిర్మలతో మాట్లాడేవారా ?"

"ఓ" అన్నాడు శ్రీహరి.

"ఆమెనిగురించి మీ అభిప్రాయం ఏమిటి ?"

"నా అభిప్రాయం నిర్మలకి భర్తంటే యిష్టంలేదని"

"అల్లా అనుకోడానికి ఆధారం?"

"మనిషి వైఖరినిబట్టి. సరదాగా వుండేది కాదు, దిగులుగా కనబడేది. పేరంటాలు, స్నేహితులు, సినిమాలు ఏవీ వుండేవి కావు."

అత్తగారెట్లాంటిది ?"

"అత్తగారు చాలా మంచిది. తల్లికంటె ప్రేమతో కోడళ్లని చూసేది."

"మామగారు ?"

"మామగారివల్ల కోడలకేం బాధ కల్గుతుంది? ఆఫీసుకు పొయ్యేవాడు, యింత గడించి పారేశేవాడు."

"నిర్మలవ్యాధిలక్షణా లేమిటో డాక్టర్లు చెప్పారా ?"

"హిస్టీరియా నరాలు పనిచెయ్యలేదు. హిస్టీరికూకు కారణం భర్తలో ఏదో లోపం వుంటమేనని నా థీరి" అన్నాడు శ్రీహరి.

ఇది నాకు సబబుగానే తోచింది.

కాని మా రెడ్డి ఖండించాడు.

"అట్లాంటివాడు పెండ్లెందుకు చేసుకుంటాడు. పైగా యితను, కాలేజీలో చదువుకునే రోజుల్లో కొంతగ్రంథం జరిపి కథానాయకుడుగా వుండేవాడని వినికిడి."

"అట్లాంటివాళ్లే, తమ లోపాన్ని కప్పిపుచ్చేటందుకు, పన్నాగంపన్ని, పెండ్లిచేసుకుంటారు ప్రపంచానికి తమలో లోపం లేదని చాటొద్దు మరీ!" అన్నాడు రాఘవులు.

"నిర్మల, భర్తనుగురించి, తనవాళ్లతో చెప్పిందా ?" అని అడిగాను.

"ఏమో. తల్లితో చెప్పివుండాలి. వాళ్ళు మాత్రం ఏంచేస్తారు. వివాహం రద్దుచేసు

గున్నా, తనకి మళ్లా పెండ్లిచేసుకునే, హక్కు లేదు. మరొకర్ని చూసుకుని రహస్యంగా ఏడవాలి." అన్నాడు శ్రీహరి

"అట్లాంటి వ్యక్తి నీ ఎరికిలో ఎవరేనా వున్నారా?" అని అడిగాడు మా చంద్రారెడ్డి అది నేనడగాలనుకున్న ప్రశ్న. కాని ధైర్యం లేక మానేశాను

"ఏమో, వుండివుండొచ్చు. లేకపోతే, ముందుముందు దొరకొచ్చు" అన్నాడు శ్రీహరి.

"ఆనాడు మధుసూదనం కూడా నిర్మలని చూశాడు." అన్నాడు రాఘవులు.

"అవును. నేనారోజున అక్కడే వున్నాను రేపోమాపో ప్రేమానందం వొస్తాడు, శెలవలేగనక, అక్కడే వుండమంది నిర్మల అత్తగారు" అన్నాడు మధుసూదనం

"నిర్మల మీతో మాట్లాడేదా?"

"అల్లాకాదు అడగవల్సింది. నువ్వు నిర్మలతో మాట్లాడేవాడివా?" అని రాఘవులడిగాడు.

"తెలివిగా అడిగానను కుంటున్నావు కాబోలు పరీక్షచేసి, నే నేదీ డైరీలో వ్రాసుకోలేదు మొత్తంమీద మాట్లాడటం జరిగేది— తన ఆరోగ్యంగురించీ, పుట్టింటి జీవితంగురించీ, తను స్కూలుకెళ్లిన రోజుల్లో వేసిన నాటకాలు—యీ విషయాలు," అన్నాడు మధు

సరే ఆనాటి విశేషాలు చెప్పండి అని కోరాను.

"ఉదయం లేచి కాఫీలు త్రాగిం తర్వాత" అని మొదలెట్టాడు మధుసూదనం

"క్షమించాలి—కాఫీ ఎవరు కలిపారు?" అన్నాడు మా రెడ్డి.

"నాకు గుర్తు లేదు. అందరికీ కాఫీలు యివ్వడం నిర్మలే యిచ్చేది, తర్వాత కాసి నేనూ, ఆ మెమరిదీ—అతని పేరు గోపేశ్వరరావు—కాసేపు కేరమ్సాడా —తొమ్మిదింటికి కాలవకి స్నానాని కెళ్లాను పదింటికి భోజనం చేసి, స్నేహితుడింటి కెళ్లి, వొంటిగంట కొచ్చాను"

"ఒహో, అందుచేత, శ్రీహరి వొచ్చినప్పుడు నువ్వు యింట్లో లేవన్నమాట. నువ్వు రాగానే, అతను వెళ్లిపోయ్యాడన్నమాట."

"అవును. వొంటిగంటన్నరకి రేడియోలో ఇంగ్లీషువార్తలు విని, నేను నిద్రపోయ్యాను. అరగంటలోనే లేచిపోయాను. రెండుంపావుకి కాఫీ త్రాగాను. మానాన్నగారి టెలిగ్రాం చూసుకున్నాను—యింటికి రమ్మని నా బాగ్ తీసుకుని, రెండున్నరకి వెళ్లిపొయ్యాను స్టేషన్‌కి వెళ్లేటప్పటికి రైలు వెళ్లిపోయింది పుస్తకాలు చూస్తూ, ప్లాట్‌ఫారమ్‌మీద వుండి, ఆరుగంటల రైల్లో మా వూరెళ్లిపొయ్యాను"

"మరోవిషయం అడుగుతున్నాను ఏమీ అనుకోకపోతే, నిర్మల ఆత్మహత్యవిషయం, ఐదుగంటలకి, మీరు స్టేషన్‌లో వుండగా తెల్సింది. చూడ్డానికి ఎందుకు వెళ్లలేదు?" అనడిగాను.

"చూసేటందు కేముంది. నిర్మల అప్పటికి తేరకుంది పైగా, నే నింటికి వెళ్లటం జరుగురు టెలిగ్రాం" అన్నాడు మధు.

శ్రీహరి మరో ప్రశ్న వేశాడు.

"నేను, 'స్టేషన్ కెందు కొచ్చావు?' అనడిగినప్పుడు, వూరికెడుతున్నానని చెప్పక, పుస్తకాలకోసం అని ఎందుకు అబద్ధమాడావు?"

"రైలు తప్పగానే, కూర్చుని విసుగెత్తి, వొకసమయంలో యింటికెళ్లి, తెల్లారగట్ల రైలుకెడదా మనుకున్నాను ఆ విసుగుదల సమయంలో నువ్వు ప్రశ్నించావు. సాయంత్రం పాసెంజెరు, ఆరోజున లైట్‌, కొచ్చింది ప్రయాణమయ్యాను."

"పుస్తకాలషాపు గంట [illegible]కదా, ఏదేనా పుస్తకం కొన్నారా?" [illegible]గాను.

"లేదు. నాదగ్గర డబ్బులేని[illegible]గులు, అర్లు ఖర్చుపెట్టి పుస్తకాలు కొనేటంగుడు" అన్నాడు

"పోనీ, యీ పుస్తకం కొ[illegible]గుండునే, అనిపించింది? [illegible], ఏ [పు]స్తకం?" అనడిగాను.

నాకు నిజంగా జ్ఞాపకంలేదు, [illegible] కనిపించదు? విల్కీకాలిన్స్‌నవల [illegible]ద వుమన్ ఇన్ వైట్' కొనాలని వుండేది." అన్నాడు మధు.

పదినిమిషాలు, మావాళ్లందరూ నవల్నిగురించి తర్కించారు, నాకు మరో సందేహం వొచ్చి, మధుని అడిగేశాను.

"ఆరోజున [illegible] స్టుమాన్ ఎప్పుడొచ్చాడు?"

"మామూలుగా, పదిన్నరకొస్తాడు. ఆ సమయంలో నే నింట్లో లేను. రెండున్నరకి, పోస్ట్‌మన్ టెలిగ్రాం యిచ్చాడని [illegible] యిందాకనే చెప్పాగా."

మా రెడ్డి, నిద్రొస్తోందని, [illegible] నిద్రపొయ్యేసంకల్పంతో శరీరాన్ని పక్కమీదవాలేశాడు. మధుని ఆఖరుప్రశ్న అడిగేశాను.

"అవుతే, నిర్మలట్లాగెందుకు చేసిందో మీకేమన్నా తెలుసా?"

"నాకు తెలీదు కారణం ఏమీ కనిపించలేదు"

"కారణం లేకుండా ఎవరన్నా అట్లాంటి పన్లు చేస్తారా?"

"స్త్రీలు ఎంతకేనా తెగిస్తారు" అన్నాడు మధు.

"ఏమోయ్, స్త్రీలు అను బహువచనం వాడుతున్నావు, ఎందరి స్త్రీలతో పరిచయం వుంది నీకు?" అన్నాడు రాఘవులు, నవ్వుతూ.

"అకారణంగా తెగిస్తారా?"

"ఏమో నా కేమీ తెలీదు."

మిగత అందరూ, నిద్రలో పడుతున్నట్లనిపించింది నాకు. ఈవిషయం ఆరాతియ్యడానికి వాకేమీ కుతూహలం కనపర్చడం లేదు. మధ్య నాకెందుకు; నేనూ, ఆలోచిస్తూ పడుకున్నాను. స్త్రీలు ఎంతకేనా తెగిస్తారు! స్త్రీలనిగురించి ఆలోచించడం మొదలెట్టాను. నిర్మలకథ విని, డిటెక్టివ్ నవలారచయిత ఎట్లాంటి కథ అల్లుతాడా అని వూహించాను. డిటెక్టివ్‌నవల్స్ వ్రాయడంలో, స్త్రీ రచయితలు కనపర్చిన చమత్కారం, ప్రతిభ, ఏపురుషుడూ కనబర్చలేడు ప్రథమశ్రేణికి చెందిన రచయితలందరూ స్త్రీలే—డొరోతి సేయర్స్, మార్జెరీ అలింగామ్, గేయోమార్ష్, అగాతా క్రిస్టీ వీరందరూ, నిర్మలతో ఎట్లాంటికథ వ్రాద్దురో? ఆ ఫక్కీలో ఏదో కథ ఊహాలో అల్లుతుంటే నిద్రపట్టేసింది దూరంగా, ఏవో అడివిమృగాల అరుపులు వినబడుతున్నాయి మానవుడి హృదయంలో అధోలోకం వుంది అందులో బంధించబడ్డ, తీరనివాంఛలనే క్రూరమృగాల అరుపులూ అట్లాగే వుంటాయి గర్జించి, బైటపడి స్వప్నంలో విహరిస్తాయి, అవకాశం చిక్కితే, మేలుకునివున్నప్పుడే, న్యాన్ని చీల్చుకుని పైనపడి మింగే అవి బైటపడకుండా వుండేందుకు చాలామంది, కాలువాలని పైకి ముసుగు బిగతన్ని పడుంటారు!



పెద్దకథ :

# అడవికాచిన వెన్నెల

(గతసంచిక తరువాయి)

శ్రీ 'బుచ్చిబాబు'

తెల్లవారింది. ఆ చంద్రుడే సూర్యుడైనట్లు, మెత్తటి కాంతి అరుణమధ్యనుంచి, నా శాలువలో దూరింది. ఉలిక్కిపడి లేచాను. చంద్రుడు కాదు, సూర్యుడే ప్రకాశిస్తున్నాడు. కాలకృత్యాలు దీర్చుకుని రొట్టెలు, టీ తీసుకున్నాం. స్నానాలు చేసేటప్పటికి తొమ్మిదైంది. వాళ్లందరూ ఆఫీసుపని చూసుకుంటాం అన్నారు. నేనూ, గురవయ్యా, అల్లా బైలుదేరాము. రెండు మైళ్ళదాకా నడిచి వెళ్ళాం. మాకు వొక్క అడవిమృగం కూడా కనబళ్ళేదు. గురవయ్య, ఆచుట్టుపక్కల మసిలిపులి చేస్తున్న దురంతాలు వర్ణించాడు. మేం, తిరిగి వొచ్చేటప్పటికి పన్నెండు కావచ్చింది. అప్పటికి ప్రేమానందం వెళ్లిపోయ్యాడు. భోజనాలు చేసి, మళ్లా కబుర్లు మొదలెట్టారు.

"మీరంతా వొకచోట కూర్చుని కాగితాలపని చేసుకోడం అయితే, యీ కాంప్ చెయ్యడం ఎందుకు?" అని అడిగాను.

రెడ్డి సమాధానం యిచ్చాడు.

"రంగనాథన్ అని మరొక పెద్ద ఆఫీసరు కూడా రావాలి. ఈ వుదయం వొచ్చి, కాంప్ చేశాడుట—యిక్కడికి ఎనిమిది మైళ్ళల్లో మరో బంగళా వుందిలే. ఆయనా, మేమూ కలిసి, రేపో, మాపో పర్యటనం సాగిస్తాం. ఆయన్ని కలుసుగోడానికి ప్రేమానందం సాయంత్రం వెడతాడుట."

"చూడండి—ఈరెండు రోజులూ మేం చెప్పినవన్నీ విన్నారు. ఆలోచించారు. నిర్మలవిషయం ఏమన్నా తేలిందా?" అని అడిగాడు రాఘవులు.

"ఆఁ" అన్నాను.

అతను ఆశ్చర్యం ప్రకటించాడు. శ్రీహరి నాదగ్గరగా జరిగాడు. ఆఖరికి రెడ్డికూడా, లేచి కూర్చుని, నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"చెప్పాలి." అన్నారు ముగ్గురూ.

"రాత్రంతా ఆలోచించాను. ఒక రకమైన కథ ఊహలో రచించుకున్నాను. కాని ఋజువు చెయ్యమంటే చెయ్యలేను." అన్నాను.

"మాకు ఋజువులు, ప్రమాణాలు, అక్కర్లేదు. చెప్పండి—ఒరే, గురవా, రెండు చుట్టలు కట్టి, టీ పెట్టరా." అని కేకేశాడు రాఘవులు.

"చెప్తాను వినండి. నాకథ మొదట్లోనే ప్రారంభమైంది. నిర్మలని ప్రేమానందానికివ్వడం స్థిరపడింది. తాంబూలాలు పుచ్చుకున్నారు. ఇది జరిగింతర్వాత—ఎప్పుడో చెప్పలేను—ఆమె జీవితంలోకి మరొకవ్యక్తి ప్రవేశించాడు—అతన్ని 'ఎక్స్' అని వ్యవహరిద్దాం—నిర్మల అతన్ని చూడ్డం, ప్రేమించటం వొకసారి జరిగింది. నిర్మలవి తీవ్రమైన వుద్రేకాలు. ప్రేమించినా, ద్వేషించినా, క్రమం, పద్ధతి, కారణం, ఔచిత్యం, సహజం, న్యాయం—యివేవీ పాటించదు. ఆమెకి 'ఎక్స్' పరిచయం కలిగింది. మాటలు జరిగాయి. కాని తలితండ్రులకి, పెండ్లికి మాటిచ్చేసింది. ఏం చెయ్యడం? . ఆపెండ్లి వద్దంటే, ఏదో కుతంత్రం జరుగుతోందని నలుగురూ పసికడతారు. తన శీలాన్ని శంకిస్తారు...మరీ ఘోషాలో వుంచేస్తారు. తను స్వేచ్ఛ పోగొట్టుకుంటుంది. 'పెండ్లివల్ల మన ప్రేమకి అంతరాయం ఎందుకుండాలి? అంతరాయంవల్ల మనప్రేమ మరింత పదునెక్కుతుంది' అన్నాడు 'ఎక్స్'. ఇంకేం కావాలి?

ప్రేమానందాన్ని పెండ్లాడింది. నాలుగు నెల్లలో కార్యం అన్నారు. ఏం చెయ్యాలి? ఎక్స్‌ని కలుసుకుని చెప్పింది. ఎక్స్ బాధపడ్డాడు. అతను చిన్నవాడు. ఉద్యోగం లేదు. ఎవర్నీ సలహా అడిగే వ్యవహారం కాదు. 'ఇంతేనా మనప్రేమ', అన్నాడు.

నిర్మల వాగ్దానం చేసింది. చేతిలో చెయ్యేసింది. భర్తను తాకనివ్వనంది. సరా? ఎట్లా సాధ్యం అని అడిగాడు. నీకెందుకు, నేను చూస్తాగా, నన్ను నమ్ము, అంది నిర్మల. ఎక్స్, అతని హృదయాన్ని ఉత్తరంద్వారా బైటపెట్టి, ఆమె కందిచ్చాడు. సంతోషంతో నిర్మల సమాధానం పంపింది.

కార్యంరాత్రొచ్చింది. నా ఆరోగ్యం బాగాలేదంది. కొంతకాలంవరకూ ఆమెని విడిచిపెట్టమని, ప్రేమానందాన్ని ప్రతిమలాడింది. అతనికి కోపం వొచ్చింది. చదువుకున్నవాడు - బలాత్కరించగలడా? జబ్బంటోంది. ఏదన్నా జరిగితే, నలుగురూ అతనికి గడ్డెడతారు. ఏవో సణిగాడు. నిర్మల లాలించింది; మాటలతో మంచిచేసుకుంది. పెద్దలందరికోసం కార్యం. ఎవళ్లకీ తెలీనక్కర్లేదు—తృప్తిపరిచింది. పక్కకితిరిగి ముసుగెట్టుకుని పడుకున్నాడు.

"మందిప్పించడం లేదా మీ వాళ్లు?" అనుంటాడు రెండో రాత్రి.

"మావాళ్లు కార్యం వొద్దన్నారు. మీ వాళ్లు నిర్బంధపెడితేనేగా యీ తంతు ఏర్పాటుచేశారు?" అనుంటుంది.

అల్లాగే మూడు రాత్రుళ్లూ గడిచిపొయ్యాయి. భర్త వెళ్లిపొయ్యాడు. నిర్మల ఎక్స్‌తో వుత్తరప్రత్యుత్తరాలు జరుపుతోంది. ఒక వుత్తరంలో 'ఎక్స్' అసూయ ప్రకటించాడు. ఆడదాన్ని నమ్మకూడదన్నాడు. 'తను హాయిగా భర్తతో గడుపుతోంది—అతనుపడే విరహం ఆమెకేం తెలుసు?' అనుంటాడు. శెలవల్లో భర్త వొచ్చాడు. జబ్బు—వీల్లేదంది—అతనికే జబ్బు కనబళ్లేదు. విసుక్కున్నాడు. 'ఏం కథ?' అన్నట్లుగా, అస్పష్టమైన ఆలోచనలు సాగించాడు. ఎట్లాగనుకున్నా ఫరవాలేదంది. భర్త వెళ్లిపోయాడు.

ఎక్స్‌ని కలుసుకుని, జరిగిందంతా చెప్పింది, నిర్మల. వారిద్దరూ, వొక్క రాత్రేనా గడిపే అవకాశంలేదు. ఏం చెయ్యటం? నీకెందుకు, నీకు హాయిగా భర్తున్నాడు. ఏదో తమాషాకి ప్రేమిస్తున్నావనీ, నన్ను ఏడిపిస్తున్నావనీ అన్నాడు. మళ్లా ప్రమాణాలు, వొట్లు. నువ్వు తల్చుకుంటే మనం కలుసుగోలేమా! అన్నాడు. ఏం చేస్తుంది. అతనికి నమ్మకం కలగడం ఎట్లా? తెగించింది. నిర్ధారణ కొచ్చింది. నాన్న కాంప్ కెళ్లాడు. అమ్మ పడుకునుంటుంది. మధ్యాహ్నం. ఏం? ఏర్పాటు చేసిరమ్మంది. అతను వెళ్లాడు. అంతా అనుకున్నట్లు జరిగింది. గదిలో ఏకాంతంగా కూర్చుని గుసగుసలు సాగించారు. ఏం జరిగిందో, ఎంతవరకూ జరిగిందో వూహించలేం—ఏం జరిగినా, అట్టేసేపు జరగలేదు. పోస్టుమన్ పిలిచాడు. లేచివెళ్లింది. భర్తదగ్గరనుంచి కవరు. ఆమెకి ఎవరో వున్నారనీ, ఆ విషయం తను తెలుసుకున్నాడనీ, అంచేత ఆమెని వొదిలెయ్యడం తప్ప గత్యంతరంలేదనీ, భర్త వ్రాశాడు. నిర్మల దిగులుపడింది; భయపడింది. గదిలో కెళ్లి, తలుపు జేర్లవేసింది. రెండు క్షణాలలో ఎవరో తలుపు తోశారు. ఎవరంది? 'నేనే, పేపరొచ్చిందేమో, చూద్దామని—పోస్టుమన్ వొచ్చాడుగా' అన్నాడు మనోరమబావగారు. అవును, పోస్టుమన్ పేపర్ కూడా తెచ్చాడు. హాల్లో బల్లమీద పెట్టాను, తీసుకోమంది. ఇంతలో చెల్లెలు లేచినట్లు, వంటింట్లో చప్పుడైంది. హాల్లో కెళ్లి, వంటింటితలుపు జార్లేసి, సందు గదిలోంచి, ఎక్స్‌ని బైటకి పంపించివేసింది. అతను వెళ్లగానే నిర్మల భయపడింది. మనోరమబావగారు, వారిద్దర్నీ చూశాడేమో—భర్త వుత్తరం వొకటి—వొదిలేస్తానని బెదిరించాడు. ఏం చెయ్యడం? మతిపోయి, నూతులో కురికింది.

ఇంక రెండో యత్నం.

మధ్యలో శ్రీహరి ఆపుచేశాడు.

"ఆగండి. ఆరోజుమధ్యాహ్నం రెండింటికి నేవెళ్లాను. ఆ సమయంలో 'ఎక్స్' ఇంట్లోనే వున్నాడంటారా? నేను నమ్మలేను. నేను రేడియో విన్నాను; పేపర్ చదివాను. తర్వాత, నిర్మల మనోరమబావగార్ని లేపి కాఫీ యిచ్చింది. నేను వెళ్లిపొయ్యాను. నా వెనకాలే అతనూ వొచ్చాడు" అన్నాడు శ్రీహరి.

"ఆ తలుపుతట్టి, పేపర్ అడిగింది మీరే కావొచ్చు. నిర్మల, అడిగినవారు మనోరమ బావగా రనుకునివుండొచ్చు. తీరా తను ముందు గదిలో కెళ్లినప్పుడు, అతను నిద్ర నటించకూడదూ? అతను కాఫీ తాగి వెళ్లిపోయినసంగతి ఆమెకేం తెలుసు?

"సరే—రెండో యత్నం పూర్తిచెయ్యి" అన్నాడు చంద్రారెడ్డి.

"నిర్మల అత్తవారింటికెళ్లింది. అక్కడ బాగానే వుంది. అత్తగారి కోడరికం లేదు; తోటికోడలు సరదా అయిన మనిషి; భర్తా, తనూ వున్నా, ఆ రోజుల్లోకూడా అంతరంగికంగా కలుసుగోలేదని నా నమ్మకం.

భర్త ఆమెని విశ్వసించేటట్లు చేసుకుంది మాటలల్ల. ఉద్యోగంలో కెళ్లిపొయ్యాడు. 'ఎక్స్' ఆ వూళ్లో వున్నాడు. తరుచు కలుస్తుండేవాడు; కలుసుగున్నప్పుడు, ఉత్తరాలు వ్రాసి, అంది పుచ్చుగోటం జరిగేది. ఉత్తరాలలో వారి ప్రేమనంతా వెళ్ళబుచ్చుగుని తృప్తిపడేవారు. ఆనాడు, ఉదయమో, మధ్యాహ్నమో, 'ఎక్స్' ఆమెకి వొవుత్తరం యిచ్చాడు. మధ్యాహ్నం, నిశ్శబ్దంగా వుంది—తనూ గదిలో కెళ్ళి పడుకుని, ఆవుత్తరం చదువుకుంది. గదితలుపులు మూసి, ఆవుత్తరానికి ప్రత్యుత్తరం వ్రాసింది. వ్రాస్తుంటే ఆగదిలోకి మరిది—కోటేశ్వరరావు—గభాలున వొచ్చి, 'ఏమిటని' అడిగాడు. ఆమె వులిక్కిపడి, ఉత్తరం దాచేసింది. అతను వెళ్ళిపొయ్యాడు. ఆవుత్తరం,తన ట్రంక్ పెట్టెలో దాచేసి, వంటింట్లో కెళ్లి పని చూసుకుంటోంది. రెండున్నర దాటింది. కొంటె మరిది, తాళాలు ఎల్లాగో వెల్లగించి, ట్రంకుతెరిచి, ఆమెవ్రాసినవుత్తరం, సంగ్రహించాడు. నిర్మల చప్పుడు విని పని కట్టి, గదిలో కొచ్చి చూసుగుంది. ఉత్తరం లేదు. కొంప మునిగిందనుకుంది. మరిది కోసం యిల్లంతా వెదికింది. ఎక్కడా లేడు. ఏం చెయ్యడం? మరిది అసాధ్యుడు. ఆవుత్తరం, అన్నగారికి చూపిస్తాడు. తనకి తలవొంపు, పరిత్యాగం, నింద తప్పదు. తాత్కాలికపౌరుషం, వుద్రేకం, ఆమెని వొక నిర్ణయానికి తీసుకొచ్చాయి. గబగబ దొడ్లో కెళ్ళి, నూతులో పడింది.

నిర్మల యింకెన్నడూ ఆత్మహత్య తలపెట్టదు." అని, నా గాథ ముగించాను.

మొదట మాట్లాడింది రెడ్డి.

"నాకంతా బాగానే కనపడుతోంది. కాని వొకటి నచ్చలేదు. 'ఎక్స్'ని కలవడంకోసం, భర్తని దూరంగా వుంచడం, వాగ్దానాలు—అవన్నీ అసహజంగా కనబడుతున్నాయి. నాచిన్నప్పుడు, మా అమ్మమ్మ రాజకుమార్తెలనుగురించి చెప్పే కథ మాదిరిగా వుంది."

గురవయ్య టీ తెచ్చాడు. అందరం మాట్లాడకుండా త్రాగాం. తరవాత వ్యాఖ్యానం రాఘవులు చేశాడు.

"మీరు చెప్పిన గాథలో, నిర్మల భర్తతో కూడక, ఎక్స్‌ప్రెస్ముందు పాతివ్రత్యం ప్రకటించడం తప్ప—యింకేమీ హర్షించదగ్గ వివరాలు లేవు. మామూలుగా మనం పత్రికలలో చదివే, వ్యభిచారుల గాథలా వుంది. నిర్మల అందమైంది కావొచ్చు. ఆమె చర్యలో కవిత్వంగాని, కళానుగుణ్యమైన సౌందర్యంగాని గోచరించలేదు."

"అందమైన స్త్రీశరీరాలకు అందమైన, ఆత్మలను కల్పించడం, పురుషుడి దౌర్బల్యానికి చిహ్నం" అన్నాను నేను.

అందరిలోకీ ఎక్కువ ఆశ్చర్యం ప్రకటించింది శ్రీహరి.

"అయితే, హంతకు డెవరండీ?" అనడిగాడతను.

"అది మీరు నిర్ణయించాలి." అన్నాను.

"నేననా మీ వ్యూహం!"

"నే నల్లా గనలేదు. డిటెక్టివ్ నవలా కారుడు కథ చెప్తాడు; హంతకుణ్ణి పాఠకుడే పట్టుకోడంలోనే వుంది, ఆనవల్స్‌లోని మజా." అన్నా.

"నన్ను నిర్మల ప్రేమించటం సంభవమా?" అని అడిగాడు శ్రీహరి.

"స్త్రీలు ఎవర్ని ప్రేమించరో, ఎందుకు ప్రేమిస్తారో, ఎందుకు ప్రేమించరో, సృష్టించిన బ్రహ్మదేవుడు కూడా, నిర్ణయించ లేడు." అన్నాను కచ్చితంగా.

ఇంతలో పెట్టిబండి వొచ్చింది. పత్రికలు, టపా చూసుకున్నారు. చంద్రారెడ్డి, ఆఫీసుకవర్లు చింపి చదివాడు.

"నాకేమన్నా వుత్తరా లున్నయ్యా?" అంటూ ముగ్గురూ ఎగడారు.

"ఉంది. మధుసూదనానికి, ట్రాన్స్‌ఫర్ ఆర్డరొచ్చింది." అన్నాడు రెడ్డి. ఆర్డర్ చేతికిచ్చాడు. అవును. మధుసూదనాన్ని, ఉత్తరజిల్లాలకి—పర్లాకిమిడికేసి—బదిలీ చేశారు. అతని స్థానంలో 'ఉన్నిథన్' అనే మళయాళీని వేశారు. తక్షణం, ఛార్జీయిచ్చి, కొత్తచోటులో ప్రవేశించాలని వుత్తరువైంది.

"ఇదేమిటి, యిక్కడి కొచ్చి, నెలేనా కాలేదు—పోదురూ, గవర్నమెంటు సర్వీసు యిల్లాగే ఏడుస్తుంది. అర్థం పర్థం లేదు. బదిలీలకి—" అని రాఘవులు, శ్రీహరి, విసుక్కుని, మధుని, బుజ్జగించి, సానుభూతి ప్రకటించడం సాగించారు. సంభాషణంతా, బదిలీని గురించి. ఆ గొడవలో హంతకు డెవరో తెలుసుకోవాలన్న, బాధ్యత నాకు తప్పింది. ఆవిషయం ఎవరూ ఎత్తలేదు.

మధుసూదనం, ఛార్జీ వొప్పగించేటప్పటికి మూడు దాటింది. మళ్లా మేం మొహాలు కడుక్కుని, మంచిదుస్తులు వేసుకుని, మధుసూదనాన్ని యింటిదాకా సాగనంపడానికి ప్రయాణమయ్యాం. మధు 'తలనొప్పిగా వుంది, కాసేపు యింటికెళ్లి విశ్రమిస్తా' నన్నాడు. మర్నాడే అతను సామాన్లూ అవి సర్దుకుని వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. కొత్త స్థలంలో చేరేటందుకు, యింకా ఆరు రోజులు వ్యవధుంది. ఈలోగా, యింటికెళ్లి, నలుగుర్నీ చూసి, డబ్బూగట్రా తీసుకుని వెడతాడుట. అతన్ని ఇంట్లో దిగవిడిచేటప్పటికి నాలుగు దాటింది. ఆ ట్రాన్స్‌ఫర్‌తో వాతావరణంలో దిలాసా తగ్గింది. నాకూ మొర్నాడు బైలుదేరివెడదామా అనిపిస్తోంది. ప్రేమానందాన్ని, వేటవిషయం అడిగి, తొందర్లో ఏర్పాటుచెయ్యించమని కోరడం మంచిదనుకున్నాను. మా రెడ్డి సలహా అడిగాను.

"రామనాథాన్ని చూసి, ఆయన సాయంత్రానికి వొచ్చేస్తాడు. కావాలంటే సాయంత్రం అడుగుదువుగాని" అన్నాడు రెడ్డి. అల్లా కొంపదాటి, చెలువుదాటి, లోయలో నడుస్తూవొస్తున్నాం. ఇంతలో వోముసిలాయన, వొగర్చుకుంటూ మా దగ్గర కొచ్చాడు.

"ఈ ప్రొద్దుటే పులి, బర్రె పోతుని పొట్టనెట్టుగుందండీ, స్వాములోరూ!" అన్నాడు. వివరాలడిగాడు రెడ్డి.

"కట్టెలు కొట్టడానికి పోయుండాం, మా ఆడోళ్లు, నేనూ. మేకల కుర్రాడు, మస్తాన్ గాడు మాతో వుండాడు. బర్రెలని ఆడే తోలుతుండాడు. పొదలఎనక్కి బర్రెపోతు ఎళ్లిందంట. ఆడు నెదుకుతుండంగా, పొదల్లో సప్పుడైంది. మస్తాన్, లగెత్తుకొచ్చాడు. మేం గొడ్డళ్లూ అవీ తీసుకుని పరుగులెత్తాం. బర్రె పోయింది. పులిజాడే లేదండి, యిసిత్రం—అడుగులు గుర్తులుండైలెండి—"

"ఎంత దూరంలో?"

"అడివిమొగలో నేనండీ—రెండుకోసులు దూరం."

అప్పటికి సూర్యుడస్తమిస్తున్నాడు. ఈ వార్త పురస్కరించుకుని, ఆ రాత్రే వేట ఏర్పాటుచెయ్యమని, ప్రేమానందాన్ని అడుగుదామని, అతని బంగళాకి వెళ్లాం. పని చేసేవాళ్ల పిల్లలు ఆడుకుంటున్నారు. ఇంకా అయ్యగారు యింటికి రాలేదన్నారు.

"పోనీ, వొవుత్తరం రాసిచ్చి, పోదాం" అన్నాను. రెడ్డి, సరేనన్నాడు.

"ఒరే, కుర్రాడా, అమ్మగార్ని పిలుస్తావా?"

"ఓ, సెలువుకొ డుండారు" అని వాడు వెళ్లాడు. పదినిమిషాల్లో, నిర్మల చక్కా వొచ్చింది. నన్ను చూసి, మందహాసం చేసింది.

"ఇంకా రాలేదు." అంది. నిర్మలకంఠం అదే మొదటిసారి వినడం నేను. కంఠం వినకపోయినా బాగుండునే అనిపించింది. అందులో మార్దవంలేదు, మాధుర్యం లేదు. కోకిల కంఠం కాదు. వొవిధంగా, నెమిలి కంఠంలా వినిపించింది. అందులో కొంత బొంగురుతనం, మసీదులో డోలువాయిస్తే మారుమోతలాగా—జీర, వున్నాయి. సౌందర్యానికి వోర్వలేక, సరస్వతి, ప్రాధేయపడి, ఆ కంఠాన్ని పాడుచెయ్యమని కోరినటు—లేక ఆతృతతో, కొత్తదనంతో, సిగ్గుతో, పగిలిన కంఠమా? కుర్రాడికి సంజ్ఞ చేసి, కుర్చీలు, బల్ల, బైట వేయించింది.

నల్లరంగు, పల్చటి చీర నిండుగా కప్పుకుంది. చేతికి రెండేగాజులు—వొకటి బంగారందీ, రెండోది, ఎఱ్ఱ ప్లాస్టిక్‌ది; విషాదంతో వొణికే పెదవులు. తీవ్రంగా లోకాన్ని శాసించే నాసాపుటాలు. కామాన్ని జుట్టుముంగురుల్లో మెలితిప్పి బంధించినట్టు కనబడని పాపిడ. నే నెన్నడూ మరిచిపోని, ఇంద్రజాలంతో తళుక్కుమనే ఆమె నేత్రాలు—అన్నీ సంధ్యలో అసహజంగా, స్వప్నంలోలాగా, మాయగా కనిపించాయి.

"వొస్తుంటారు. కూర్చోండి, టీ పెడతాను." అంది.

"అప్పుడే రెండుసార్లైంది. శ్రమపడకండి." అన్నాను.

నిర్మలకళ్లల్లో నవ్వు, చెక్కిళ్లమీదికి జారింది. ఈఅల్పమైన శరీరంలో, ఈ లేత జీవిలో, యింత శక్తి, యింత బలం, యింత తృష్ణ, అడివిని దహించేసే, ప్రేమజ్వాలా!

"కాగితం, కలం, యిప్పిస్తారా?" అన్నాడు రెడ్డి, ఆవిడ యింట్లోంచి, లెటర్‌పాడ్, పెన్, తీసుకొచ్చి, బల్లమీద పెట్టి, లోపల గుమ్మంలో కెళ్లి నిలబడింది.

'మీకిక్కడ వొక్కరికీ భయంగా వుండదూ?' అని లోపల ప్రశ్నని నిర్మాణం చేసుకున్నా కాని బైటకి అడగలేక పొయ్యాను. ఉత్తరం వ్రాశాను?

"అయ్యా,

ఈవుదయం, పులి అడివి మొగలో బర్రెను చంపి తీసుకుపోవడం చూసినవాళ్లు నాతో చెప్పారు. ఈ రాత్రి, అది మన అడవిలోనే వుండొచ్చు, అంచేత, యీ వుత్తరం చూసుకున్న తక్షణం, మీరు, వేటసన్నాహం చేస్తారని ఆశిస్తున్నాను. మధుసూదనానికి, ట్రాన్సఫరైంది. తన వొంట్లోకూడా బాగా లేదన్నాడు; చార్జీ యిచ్చేశాడు. రేపే ప్రయాణం అవుతాడుట. అంచేత సర్దుకొని, రెస్టుతీసుకుంటాడు. కాబట్టి, యీరాత్రి, వేటకి చంద్రారెడ్డి, నేను, రాఘవులు, శ్రీహరి, సిద్ధంగా వుంటాము. మిగతఏర్పాట్లన్నీ రెడ్డి స్వయంగా చేస్తానని హామీ యిచ్చాడు. నేను కూడా, వేట ముగిస్తే, రేపో, మాపో వెడదామనుకుంటున్నాను. ఈ వుత్తరానికి అన్యథా ఎంచరనుకుంటాను."

ఉత్తరం మడిచి, కలం మూసి బల్లమీద పెట్టాను. సూర్యుడు అస్తమించినట్లు, పడమటి ఆకాశంలో మేఘాలు శోణసంచాకాలుస్తున్నాయి. పవిత్రమైన రక్తంతో సంధ్యాదేవి బొట్టు పెట్టుకుంది. ఆకాశంలో పూర్ణచంద్రుడు కన్ను తెరిచాడు. ఎఱ్ఱటి మేఘాలు చంద్రుడిమీదికి పాకి, బంగారు తీగెలతో అలంకరించాయి. అడివిచీకట్లు మా చుట్టూ అలుముకుని, నిర్మలచీరసలుపులో కేంద్రీకరిస్తున్నాయి. ఆ చీకటిని ఛేదించగల నిర్మలనేత్రాల మెరుపు తళుక్కుమనడం మిగిలింది.

ఉత్తరం, ఆమెకిచ్చాను.

"రాగానే వారికివ్వండి."


తల పంకించింది—అడివిని ట్టూర్చిన తీక్ష్ణంలె —

"మీరూ చూడొచ్చు."

అని నేనూ, రెడ్డీ వెనక్కి మళ్లి నడవడం సాగించాం. పదిగజాలు వెళ్లాక వెనక్కి తిరిగాను; రెడ్డి నామెడని ముందుకి తిప్పాడు. కాంప్‌దగ్గరికి వొచ్చేశాం.

భోజనాలు చేసి వెన్నెట్లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. ప్రేమానందం గుర్రంమీద చక్కావొచ్చాడు. గురవయ్య, మరో నాలుగు గుర్రాలు సిద్ధం చేశాడు. రెండు పెట్రొమాక్స్‌లైట్లు, తీసుకొని, అరడజనుమంది, కూలీలు, తుపాకులు, బల్లాలు, వల, తీసుకొని, రెండు మేకపోతుల్ని తోలుకుంటూ నడిచారు.

ఫ్లాస్కుల్లో టీ పోసుకుని, బిస్కట్లు, డబ్బారసుకులు, పిస్టల్సు తీసుకొని మేం, గుర్రాలమీదికెక్కేటప్పటికి, పదకొండైంది గురవయ్య, ప్రేమానందం, శ్రీహరి, బాగా ఆరితేరిన రౌతులు—అంచేత ఆముగ్గురూ ముందుగా వెడుతున్నారు. నేను, రాఘవులు, రెడ్డి కబుర్లు చెప్పుగుంటూ వెనక మెల్లిగా 'ట్రాట్' లో వెడుతున్నాం. అరగంటలో అడివి ప్రవేశించాం. గియ్యమని భయంకరంగా కీటకాల రొద; వెన్నెలని చూరనివ్వని దట్టంగా అల్లుకున్న అడివి—ఆకుల మధ్యనుంచి పరీక్షగా చూస్తే, చంద్రుడి క్రీగంటిచూపులు అగుపడ్తాయి. క్షణక్షణం, ఏదో మృగాన్ని ఎదుర్కొన్నట్లు భ్రమ—తీరా ఏమీ వుండదు. ఆ అనుభవం, భయంగా, చిత్రంగా వుంటుంది. ఎన్నడూ రాని, తెగింపుకూడా వొచ్చింది నాకు. ప్రేమానందం, చెట్లమధ్య నిలిచిపొయ్యాడు.



అందరం గుర్రాలు దిగి, ముందుగా వొచ్చిన, అరడజనుబంట్రోతుల్ని, దీపాలతో అక్కడ వొదిలేశాం. మిగతవాళ్లం, మేకపోతుల్ని తోలుకుంటూ ఫర్లాంగు నడిచాం. ఒకచెట్టుకి, గురవయ్య మేకపోతుని కట్టేశాడు. అరఫర్లాంగుదూరంలో, ప్రేమానందం, రెండో పోతుని మరోచెట్టుకి కట్టేసి తను, ఇరవై గజాలదూరంలో పెద్దచెట్టు మొగలోకి ఎక్కి కూర్చున్నాడు.

నాకు చెట్లపై కూర్చోడం చేతకాదు. నాకోసం, రెడ్డి వలతో చెట్టుకొమ్మలమధ్య వుయ్యాల అమర్చాడు. అందులో నేను, రెడ్డి, కూర్చున్నాం. గురవయ్య, రాఘవులు, శ్రీహరి, మొదటిపోతువగ్గర చెట్టుమీది కెక్కారు. గుసగుసలుతప్ప ఓగ్గరగా మాట్లాడ్డం వల్లకాదన్నారు. నాకూ పిస్టల్ యిచ్చారు. సమయం వొస్తే, దాన్ని వుపయోగించగలనన్న ధైర్యం నాకు లేదు. దాని వునికి, నాతోటివారికేనా వుపయోగపడుతుందన్న ధీమావల్ల, నేను నిర్భయంగా వున్నా, లోపల బెదురుగానేవుంది. కాని, పులి—అందులో, అది ముసిలిపులిట—

యింతఎత్తు చెట్టుమీదికి ఏం ఎగురుతుంది? పులిభయం వొక్కటే కాదు. నన్ను పట్టుకున్నది. కొమ్మలమీద పాములుంటే! చప్పుడైనప్పుడల్లా వూపిరి బిగపెడుతూ అల్లాగే గంట కూర్చున్నాం. ఏమీ జరగలేదు.

అడివి కాచిన వెన్నెలకేసి చూశాను. వెన్నెలఅందం, ఆనాడు చూసినట్లుగా నేనెప్పుడూ చూళ్లేదు. ఎన్నడూరాని ప్రియుడికోసం వేచివుండిన కన్యకలోని మనోనిశ్చలత్వం, ఆ వెన్నెట్లో వుంది. కాలం గడవదు. ఆవలింతలొస్తున్నాయికాని నిద్రరాదు. గుండెలు కొట్టుకుంటున్నాయి. కాని జీవంలేదు. గడియారంకేసి చూశాను అడివికి హడిలిపోయి తిరగడం మానేసిందేమోనని! మానలేదు. వొంటిగంటైంది.

ప్రేమానందాన్నిగురించి ఆలోచించాను. అతను చాలా ధైర్యవంతుడులా తోచాడు. ఏం ధైర్యంవుండి ఏం ప్రయోజనం! భార్యముందు పిరికిపంద—అతనికి కావల్సినదాన్ని సాధించే శక్తి అతనికి లేదు. అతనికి ఏ ముహూర్తాన నామకరణం చేశారో పెద్దలు, అతని జీవితంలో, ప్రేమా లేదు, ఆనందం లేదు. అతని స్థానంలో నే వున్నట్లు వూహించుకుని బాధపడ్డాను. ఆ పరిస్థితుల్లో, ఎవరుమాత్రం ఏంచెయ్యగలరు! భార్యని శంకించగలడు, కాని ఋజువు చెయ్యలేడు; భార్యని ద్వేషిస్తాడు, కాని ప్రేమని వొదులుకోలేడు; ఆమెని కలవలేడు. కాని, ఆమెని విడిచిపెట్టనూ లేడు.

పులిగర్జన వినపడింది. ఉలిక్కిపడి, కాళ్లు రెండూ పైకి లాక్కుని ముడుచుకున్నాను. రెడ్డి చెప్పాడు—అది పులిగర్జన కాదుట—గురవయ్య, పులిమాదిరి అరవడం నేర్చుకున్నాడుట. ఆ అరుపు విని, నిజంపులి అక్కడికి రావడం జరగొచ్చుట.

పులి వొచ్చినా, ఏదిక్కునుంచి వొస్తుందో ఎవరికి తెలుసు? నేను చూడకుండానే, అది రావడం, వెళ్లడం జరుగుతుందేమో ననిపించింది. అన్నిదిక్కులా పరకాయించి చూశాను. నాకేమీ కనిపించలేదు.

బిస్కట్లు తిన్నాం; రెడ్డి టీ పోశాడు త్రాగాం. మరో సిగరెట్టు ముట్టించాను. వో అరగంట గడిచింది. మరో సిగరెట్టు ముట్టించాను. గురవయ్య మళ్లా గర్జించాడు. రెండు మూడు నిమిషాల్లో, తుపాకీ మ్రోగింది. నేను కొమ్మని గట్టిగా పట్టుకుని కళ్లు మూసుకున్నాను. మరోచోట దగ్గరలో, తుపాకీ మ్రోగింది—కళ్లు తెరిచాను—దూరంగా వెళ్లిపోతోంది పులి, మేకపోతుని వీపుమీద లాక్కుని, వెనకభాగంమాత్రం నాకు కనబడింది. మరోసారి తుపాకీ మోగించి, చెట్టుమీదనుంచి ప్రేమానందం దుమికి, పొదవైపు పరుగెట్టాడు. రెడ్డికూడా దూకాడు. అందరూ దిగారు; నన్నూ దించారు. పదినిమిషాల్లో ప్రేమానందం తిరిగివొచ్చాడు.

"పోతుని చంపి, వొదిలేసిపోయింది—మన దెబ్బలు సరైన చోట్ల తగల్లేదు. కుంటుతోపోయింది" అన్నాడు.

"దెబ్బలుతిన్న పులి చాలా ప్రమాదం, ఈ రాత్రికి వెనక్కిపోదాం—"అన్నాడు రెడ్డి. ఆ అనుభవం చాలన్నా, నేకూడా. అపూర్వమైన అనుభవాన్ని, కలగజేసినందుకు ప్రేమానందాన్ని 'థ్యాంక్' చేశాను. అంతటితో వేట ముగించి, వెనక్కి మళ్లాం. కాంప్‌లోకి చేరుకునేప్పటికి తెల్లారి నాలుగైంది.

తేయాకు లేకపోయింది. కాసిని వేడిపాలు తాగి పడుకున్నాం. తీవ్రంగా నిద్రపట్టేసింది. తొమ్మిదైందో, పదైందో గుర్తులేదు; ఎవరో లేపిన ట్లనిపించింది. మిగతా అందరూ లేచి పనులు చేసుకుంటున్నారు. వెడుతున్నానని చెప్పడానికొచ్చాడు మధుసూదనం. లేచి కళ్లు తుడుచుకున్నాను.

"అప్పుడే?" అన్నాను.

"ఈసారి వకేషన్‌కి మా వూరు రండి. పర్లాకిమిడిలో ప్రసిద్ధమైన అడివీ, మృగాలూ వున్నాయి.

"అల్లాగే."

"మీ రింకా రెండు రోజు లుండండి—మావాళ్లందరితోనూ—నేకూడా వుండనా—వాళ్లందరికీ చిన్నబోయిన ట్లుంటుంది" అన్నాడతను.

"నాకు వీలుపడదు. చూడవల్సిన వింత కూడా చూశాను. నేనూ సాయంత్రం వెడదామనుకుంటున్నా."

మధుసూదనం వెళ్లిపొయ్యాడు.

"ఎప్పుడైనా వుత్తరం వ్రాస్తూండు—మీ అనుభవాలు చదువుకునైనా తృప్తిపడతాను" అన్నాను. అతను నవ్వుతూ వెళ్లాడు.

నేనింకా వొకటి రెండు రోజు లుందామనుకున్నా, నన్ను గట్టిగా చంద్రారెడ్డి వుండమనలేదు. సర్వేకి పైలుదేరమని వాళ్ల ఆఫీసర్ రామనాధయ్యర్ ఆరోజే ప్రయాణం కట్టాడుట. వాళ్లు టూర్ చేస్తుంటే, నాకేం కాలక్షేపంగాదని, అందరిదగ్గరా సెలవుతీసుకుని, ఆ మధ్యాహ్నం మూడింటికే నేనూ ప్రయాణమయ్యాను. రెడ్డి పెట్టెబండి తెప్పించాడు బెడ్డింగ్ అందులో పడేసి కూర్చున్నాం. బండి కదిలింది. ప్రేమానందంతో మరోసారి చెప్పి గుడ్‌బై కొట్టడం మంచిదేమో అన్నాను, రెడ్డితో.

"నీ కింకా చిన్నతనం పోలేదురా—నిర్మలని చూడాలని—అవునా?" అన్నాడు రెడ్డి, నవ్వుతూ. నేనూ నవ్వేశాను.

"రైలు కింకా అరగంటే టైముంది. ఆలస్యం చేశావంటే, తెల్లారేదాకా, ప్లాట్‌ఫారమ్‌మీద గడపాలి, నీ యిష్టం" అన్నాడు.

"తిన్నగా, స్టేషన్‌కే" అన్నాను.

రైలొచ్చింది, ఎక్కాను.

"పట్నంనుంచి, చుట్టలపెట్టెలు, పంపు" అన్నాడు.

"నేను తిన్నగా, పట్నం వెళ్లడంలేదు. మధ్యలో దిగి మేనమామని చూసి, రెండు రోజు లుండి వెడతాను" అన్నాను.

రైలు కదలడానికి సన్నాహం చేస్తోంది.

ఇంతకీ అసలువిషయం అడగడం మరిచేపొయ్యాను. 'ఎక్స్' ఎవడు?" అనడిగాడు, రెడ్డి.

"నీకు తెలీదా?"

"నాకు నిజంగా తెలీదు."

"డిటెక్టివ్ నవల్సులో అయితే, కథ చెప్పినవాడే హంతకుడు. దానిప్రకారం నే నన్నమాట" అని బిగ్గరగా నవ్వాను.

రైలు కదిలింది.

"నీ మొహం" అన్నాడు రెడ్డి.

నా మొహాని కొచ్చిన తిరకాసేమిటా అనుకుని మొహం తడిమి చూసుకున్నాను.

దూరమైపొయ్యాడు—అతను, అడివి, నిర్మల, వెన్నెల, పులి, పెట్రొమాక్స్, గురవయ్య, మేకపోతు, చల్లటికాలను, నల్లటి చీర, ఎర్రటిసంధ్య—అన్నీ మసగలోకి జారిపొయ్యాయి. రైలు మెలికె తిరిగింది. అదుగో దూరంగా, ప్రేమానందంబంగళా కాబోలు. దానిపక్క కొండ; కింద చెరువు.

ఆ నీళ్లల్లో నిర్మలప్రతిబింబం పడింది కదా—ఇంకా, దూరమైపోయింది. అడివిలో కలిసింది ఆకాశం.

* * *

మేనమామగారి వూళ్లో రెండు రోజులుండి, శనివారంమధ్యాహ్నం, మూడింటికి పట్నం చేరుకున్నాను. వెళ్లగానే, గుమ్మంలో పోస్టమన్ నిలబడ్డాడు. రిజిస్టర్డ్ కవరొచ్చిందిట. నిన్న చూసి తిరిగెళ్లిపోయాడుట. సంతకంపెట్టి, అతను వెళ్లగానే, చించి చూశాను.

“ఇంత జరిగాక నేనింక ఎవ్వరికీ దక్కను. నా పిచ్చి మధు! నీకోసం యిన్నాళ్లు నా ప్రాణాలు నిలబెట్టుకున్నాను. నన్ను భగవంతుడు పుట్టించగూడదు. నన్నొక్కదాన్ని పుట్టించి వూరుకోగూడదూ? నిన్నూ పుట్టించాడు. నువ్వు నా జీవితంలో కెందుకొచ్చావు— నన్ను ప్రేమించడానికి కాదు. నన్ను చంపడానికి. నిన్ను చూడగానే అనుకున్నాను— నా పాలిట యమధర్మరాజువని. నీ కౌగలింతల్లో, హస్తాల్లో బిగించి, నలిపిచంపుతావనుకున్నాను. అప్పటికప్పుడే, పెండ్లి స్థిరపడిపోయింది.

నన్ను రోజాపువ్వం అనేవాడివి— ఆయన ముల్లు, నువ్వు మధు త్రాగే తేనెటీగవు. ఎంతకాలం బ్రదకనిస్తారు. నాన్నతో చెప్పి, నిన్ను అత్తారింటిదగ్గరగా తెచ్చుకున్నాను. ఆయన వొచ్చినప్పుడల్లా, వేధించుకుతినేవాడు. ఏడాది గడువు కోరాను—పాపం ఎంతమంచివారు! సరేనని నన్ను తాకకుండా వొదిలేశారు. దూరంగా నక్షత్రంలా నిన్ను ప్రేమిస్తాను. నాకింకేమీ వొద్దు అనేవాడవుకాని, నిజంగా అల్లా వుండేవాడివి కావు. నాకు దగాచేసుకోడం చేతకాదు. నాకు నువ్వే కావాలి—వొక్క క్షణం—తరవాత తృప్తితో వూపిరి పూర్తిగా వొదిలేస్తాను. నీలా, దూరంగా ఆరాధన, స్నేహం, చూపులు, కవిత్వాలు నా చేత కావు.

ఆయనకి యీ వుద్యోగం అయింది. నాన్నతో చెప్పి, నిన్నూ యిందులో వేయించుకున్నాను.

ఆయనపాలిటి చిరుతపులిని నేను— నన్ను బోనులోవుంచి వినోదిస్తారు. నువ్వు స్వేచ్ఛగా అడవిలో విహరించే మొగపులివి. మనిద్దర్ని విడదియ్యడమే, ఆయనవుద్యోగం. నీలగిరిలో నువ్వుండగా నన్ను కాపరానికి తీసికెళ్లలేదు. తీసికెళ్లమని బ్రతిమలాడాను. సరే నన్నారు. నిన్ను ముందు బదలీచేసి మరీ కాపరం పెట్టారు.

మళ్లా యిద్దరం నీ సన్నిధానంలో పడ్డాం. నా వ్రతం ఫలించింది. నిన్ను చూస్తూ, నువ్వు వొదిలిన శ్వాస పీలుస్తూ, నే జీవిస్తున్నాను.

మీ పట్నంమిత్రుడి ధర్మమా అంటూ, వొక్కరాత్రి నీతో గడిపే అవకాశం చిక్కింది. ఆయన బోనుతెరిచి, వేటకి వెళ్లాడు. నే నా అవకాశం వొదులుకుంటానా—? నా మధుని తెచ్చుకున్నాను. నా జన్మ తరించింది—ఆ వెన్నెల, ఆ అందం, నీ కళ్లల్లో కసి, నీ అధరాల్లో మధు—నిన్ను ధ్వంసం చేసేటందుకు పురిగొల్పాయి. మంచుని, మధునీ, పీల్చుకుని వికసించిన మొగ్గలాగైంది నా మనస్సు. దాన్ని హరించి, నాశనంచేసి, శరీరం మట్టుకు ఆయనకోసం విడిచిపెడతావా దొంగా!

మర్నాడు మధ్యాహ్నం, ఎన్నడూలేంది, ఆయనముందు చలించాను. రాత్రి నీతో అనభవం జ్ఞాపకానికొచ్చి, నన్ను రెచ్చగొట్టింది. ఆయనతో చలగాటం ఆడాను— మభ్యపెట్టాను. లాలించి, కొంటెగామాసి ఆయన్ని పురిగొల్పాను. పులిగర్జనతో మహారణ్యం రేగినట్లు, ఆయన ఆశ్చర్యపడి, యిదేమిటా అనుకుని, ఎన్నాళ్లనుంచో అణిచిపెట్టిన కామంతో, భూకంపంలాగ, అగ్నిపర్వతంలాగ, నామీది కొచ్చేశాడు. నేను గ్రహించుకున్నాను—పొరబాటు చేశానని. నా గర్వానికి, పొగరుకి తగిన శాస్తి భగవంతుడు చేశాడనుకున్నాను.

ఆయనరాక్షసత్వం నేను సహించలేకపోయ్యాను. విదిలించుకుని, తోసిపారేసి, పరిగెత్తాను. ఆయన మరింత పేట్రేగి, నన్ను తరిమారు.

‘రాత్రి పులిమాదిరి తప్పించుకు పారిపోదామనుకున్నావేం!’ అన్నారు.

నేను దొరికితే ఆయన చంపేద్దురు— నీకోసం ఏమీ మిగల్చకుండా. కాని, మధూ నా వెర్రిమధూ! నిన్ను తాకిన యీ శరీరాన్ని మరొకరి కివ్వడం నాచేతకాదు. నేను జారిణిగా వుండలేను. రహస్యం బ్రదుకు నావల్ల కాదు. స్వేచ్ఛగా అడివిలో సింహంలా విహరించాలి. నీ ప్రేమ నన్ను పతివ్రతని చేసిందంటే నమ్మతావా? పెండ్లి నన్ను జారిణిగా చెయ్యబోయింది. పెండ్లిని ధిక్కరించడం అంటే మరణించడం, మధూ, మాటలుకాదు.

‘ఇప్పుడుకాదు, రాత్రి’—అని వీధిలో కొచ్చేశాను. ఆయనల్లా ఎక్కడికో పిచ్చివాడిలా నడిచి వెళ్లిపొయ్యారు—పాపం. ఎంతటి పరాభవం, ఎంతటి అసంతృప్తి. ఆలోచిస్తే, ఆయనే బోనులో సింహంలా కనిపించారు, నేకాదు.

వ్యవధి దొరికింది—యీ వుత్తరం వ్రాసి ముసిలిదాన్ని పోస్టుడబ్బాలో పడెయ్యమని, నేను జీవితం చాలించుకుంటున్నా. ఇంక జీవితంతో పెనుగులాడలేను. నీకోసం యింతకాలం బ్రతికాను. నిన్ను అనుభవించాను. మళ్లా సంసారంలో పడి, దగాచేసి, మోసంచేస్తూ రహస్యంగా, దుర్నీతిపాలై, తలవొంపులు భరిస్తూ, రోజులు వెళ్లబుచ్చుకోడంలో, ఏముంది మధూ! ఒక్కక్షణం విశ్వంలోవున్న అందాన్ని భరించి, మధురంగా జీవించి, పవిత్రంగా మరణించటం మంచిదికదూ?

‘నిర్మల నూతులో ఎందుకు పడిందో కనుక్కున్నావా?’ అన్న ఆకాశరామన్న వుత్తరం నేనే వ్రాశాను. నాకీ సంకెళ్లు తప్పుతాయని నే ఎప్పుడూ అనుకోలేదు. నా జీవితయథార్థం నీకుతప్ప, ఎవ్వరికీ తెలీకపోయినా నాకు దిగులులేదు. తెలిస్తే ఆయ నెంత బాధపడతారు? నేను జీవించి వుండగా పెట్టినబాధ చాలక, చనిపోయింతర్వాతకూడా ఆయన్ని బాధపెట్టేటంతటి స్వార్థపరురాలని కాను మధూ. ఇంక నేను నీకు కనబడను. నీ రహస్యాన్ని నాతో, నాలో హతం చేసుకుంటున్నాను మధూ.”

ఆ కవర్లో మరో వుత్తరం వుంది;

“మీరు నాపేరు బైటపెట్టకుండా, చమత్కారంగా కథ అల్లినందుకు కృతజ్ఞుణ్ణి. దానికి ప్రతిఫలంగా, నిర్మల నాకు వ్రాసిన కడసారి లేఖలో కొన్నిభాగాలు కాపీచేసి పంపుతున్నాను—మీకు పూర్తి నిజం తెలీడం మంచిదని. ఉత్తరంవ్రాసిన మరుక్షణాన, నిర్మల యింటివెనక కొలనులోపడి ఆత్మహత్య గావించుకుంది. ఆవార్త చెప్పడానికి విచారిస్తున్నాను. స్నానంచేస్తుంటే, లోతులోకి దిగి, ప్రమాదవశంగా మరణించినట్లు పత్రికలు ప్రకటించాయి. ఇట్లు,

మధుసూదనం.”

ఒకటి రెండువిషయాల్లో నేను పొరబడ్డానని వొప్పేసుగోడం మంచిది. నిర్మల యింకెప్పుడూ ఆత్మహత్య తలపెట్టదు, మరణించదు, అనేశాను. అది తప్పని, నిర్మల జీవితం ఋజువుచేసింది.

## ఆరోగ్య విజ్ఞానం:

# ఆహారసారం వొంట పట్టాలంటే-

"మీరు ఆహారాన్ని ఎలా వండుతున్నారో, ఏయే పదార్థాలు ఏ మోతాదుల్లో ఎలా తీసుకుంటున్నారో పరిశీలించాలని వచ్చాను. మీకుటుంబంతోసహా మొత్తం 64 కుటుంబాలలో ఈరీతిగా పరిశోధన చెయ్యాలని మా కాలేజివారు మమ్మల్ని నియమించారు"అని ఒక కాలేజీవిద్యార్థిని సమాజసేవాసంఘం తరఫునవచ్చి ఒక ఇంటికి వెళ్ళి చెప్పింది. ఈ పరిశోధన సరిగ్గా ఒక సంవత్సరం జరుగుతుందనికూడా చెప్పింది. ఇంటిఇల్లాలు ఒక్కక్షణం ఆలోచించింది, తరవాత "అలాగే నమ్మా, ఇందులోపోయే దేముంది. ఇది మాకూమంచికే కావచ్చును. కాని మా ఇంట్లో ఎప్పుడూ ఏలోపమూ లేదు. ఇంట్లో అందరూ కడుపుపట్టినంతా తింటారు. అందువల్ల మీ పరిశోధనకి మా సంసారం పనికొస్తుందో లేదో తెలియదు" అని సమాధానమిచ్చింది.

కాని చిత్రమేమిటంటే మొత్తం 64 కుటుంబాలవాళ్లూ ఇలాగే అన్నారు; తిండి కెన్నడూ లోపం లేదనీ, తమ కే బాధ లేదనీ తిండికి కరువైతే వచ్చే రోగాలేవీ తమ ఇళ్లలో ఎవరికీ రావనీఅన్నారు. అందరూ మరీ భాగ్యవంతులూ కారు. తిండికి లోటు లేకుండా ప్రశాంతంగా జీవనం గడుపుతున్నారు. వాళ్లు స్వంతఇళ్లలో ఉంటున్నారు. అద్దెఇళ్లలో ఉండవలసిన అవసరం వాళ్లకి లేదు. చూస్తే 64 ఇళ్లలో ఉన్న మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలు మొత్తం 239 మందీ ఆరోగ్యంగా ఉన్నట్టే కనపడతారు.

కాని కాలేజీవిద్యార్థినులు, విద్యుచ్ఛక్తి సప్లై కార్పొరేషను అధికారులు, శిశు ఆరోగ్యసంరక్షణశాఖోద్యోగులు, వైద్యాలయోద్యోగులు కలిసి చేస్తున్న ఈ పరిశోధన ఎలా ఉంటుందో, ఫలితాలెలా తేల్తాయో చూడాలని అందరూ కుతూహలంతో అంగీకరించారు. సరే ఆహారం ఆరోగ్యం మొదలైన విషయాల్ని గురించి సలహాలిచ్చే మంచి పుస్తకాలూ, కరపత్రాలూ చదవడం ఆరంభించారు.

పరిశోధన ముందుగా అందరినీ వైద్యులు పూర్తిపరీక్ష చెయ్యడంతో ఆరంభమయింది. మనుషుల ఒడ్డుపొడుగులూ, బరువూ వ్రాసి ప్రతి ఒక్కరికీ సంబంధించిన వివరాలతో పత్రాలు తయారుచేశారు. ఎముకలెలా ఉన్నాయో చూడ్డానికి అందరికీ ఎక్స్‌రే ఫోటోలు తీశారు. రక్తం పరీక్షచేశారు. మైక్రోస్కోప్ సహాయంతో చర్మాన్ని పరీక్షచేశారు. కళ్లు, పళ్లు, చిగుళ్లు, నాలుక పరీక్షచేశారు. నెత్తురు పరీక్షచేసికి నిజసారం మొదలైన వేరీతిగా ఉన్నాయో పరీక్షచేశారు. ఈవిధంగా పరీక్షచేసి ఫలితాల్ని పత్రాలు తయారుచేశారు.

మొదట జరిగిన ఈ వైద్యపరీక్షఫలితాలు చూసేసరికి ఇల్లాళ్లు విస్తుపోయారు. అందరూ తిండి కెన్నడూ ఏలోటూ లేనివాళ్లే అయినా, వైద్యపరీక్షవల్ల దాదాపు అందరికీ ఆహారం చాలడంలేదని రుజువయింది. చాలక పోవడంవల్ల దేహపుష్టిలో లోపం కనిపించినా ఈలోపం ప్రమాదమయినది కాదు. కాని లోపం ఉండడంమాత్రం నిజం. ఆహారాన్ని సక్రమంగా తీసుకోకపోవడంవల్ల ఈ లోపం సంభవిస్తోంది. ఇప్పటికే ప్రమాదభయం లేకపోయినా, ఈరీతిగానే ఆహారం తీసుకోడాన్ని అనుసరిస్తుంటే కాలక్రమేణా ఆ భయానికి అవకాశం ఉంటుంది.

పురుషులకంటె స్త్రీలలో ఈ లోపం అధికంగా కనపడింది. నూరింట 60 మంది వయసుకీ ఒడ్డుపొడుగులికీ తగినంత బరువు లేరు. వారికి ఆహారంవల్ల లభించవలసిన జీవధాతువులు (విటమిన్స్), మాంసకృత్తులు (ప్రొటీన్స్), ఖనిజసారాలు కావలసినంతగా అందడంలేదు. (కొందరు ఒళ్లుపెరిగిపోకుండా ఎప్పుడూ సన్నగా నాజూగ్గా ఉండాలనే కోరికతో ఆహారం తక్కువగా తీసుకుంటారు కూడా). ఎముకలవృద్ధికి అవసరమైనదానికంటె కాల్షియం తక్కువ

---

ఆత్మహత్య పాపమా, మంచా, అని నిర్వచనంచేసి, ఆమెజీవితానికి విలువకట్టే, అధికారం నా కేమీ కనబడలేదు. భర్తని ప్రేరేపించి, అందులోంచి తప్పించుకున్న దృశ్యం స్మరిస్తే భయమేస్తుంది. నా గర్వానికి, పొగరుకి తగిన శాస్తి జరిగిందని, తనే అన్నది.

పతివ్రతగా మరణించడమా? జారిణిగా బ్రతకడమా? అదీ ఆమెవిషమసమస్య; సమాధానం ఆమె చెప్పేసింది.

పతివ్రత ప్రేమించటం అనేది మన సంప్రదాయానికే విరుద్ధం, ప్రేమించకపోవడం, మానవత్వానికి విరుద్ధం. ప్రేమించడం అంటే నా బోటి నాగరికుల కేం తెలుసు? ప్రేమలో అడివితత్వం, ప్రాచీనత్వం, వుంటాయి. ప్రేమతత్వానికీ, నాగరికతకీ సమన్వయం కుదరదు. మనం ప్రేమకి విలువకడతాం, దాని లోతులు వితర్కిస్తాం. అర్థంచేసుకుంటాం. ప్రేమించడంగురించి ఆలోచిస్తాం, కాని, ప్రేమించడం నాగరికులచేత కాదు. నిర్మలని ఏ బోనులో బంధించగలం? ప్రేమని ఏనీతినియమంతో అరికట్టగలం? వొచ్చేసేటప్పుడు, వేళాకోళంగా, నేనే హంతకుణ్ణి అన్నాను రెడ్డితో. ఎంత నిజం! నేనా అవకాశం కల్పించకపోతే, నిర్మలింకా జీవించేవుండును.

నా కేమీ విచారంలేదు. నా అల్పత్వం, అనావశ్యకత, నాకు తెల్లమయ్యాయి. నే కల్పించిన అవకాశంవల్ల, మరొక జీవి విముక్తిపొందాడు ఆమె భర్త. ఈ విషయాలన్నీ, మధుసూదనాన్ని సంబోధిస్తూ, వుత్తరం వ్రాశాను.

కాని వుత్తరంలో నాకు విశ్వాసం కుదరలేదు. యథార్థాన్ని యెదుర్కొన్న తర్వాత, భాష, భావాలు, సానుభూతులు నైతిక, ఆధ్యాత్మికవిలువలు, హాస్యాస్పదంగా గోచరించాయి. మధ్య నే నెవర్ని అని, మన వేదాలు బోధించినప్రకారం ప్రశ్నించుకుని, ఉత్తరం చించివేశాను.

---